

ఇంటర్‌బోర్డు ఆర్‌ఐవోగా మురళీధర్



విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులుగా అనకాపల్లి జిల్లా సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.మురళీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఆర్‌ఐవోగా పని చేసిన ఆర్.సత్యనారాయణ బుధవారం పదవీ విరమణ చేశారు. దీంతో మురళీధర్‌కు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ సౌరబ్‌గౌర్ ఉత్తర్వులు ఇచ్చారు.

గ్రీవెన్స్ పరిష్కారానికి ప్రాధాన్యం

జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మయూర్ అశోక్

- భూముల పరిరక్షణ, పౌర సరఫరాల పంపిణీపై ప్రత్యేక దృష్టి



బాధ్యతలు స్వీకరిస్తున్న మయూర్ అశోక్

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలను పరిశీలించి, వాటిని సత్వరం పరిష్కరించేందుకు కృషిచేస్తానని జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ కాత్వాటే మయూర్ అశోక్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తానన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతానన్నారు. రెవెన్యూ అంశాలతోపాటు భూముల పరిరక్షణ, పౌర సరఫరాల శాఖ ద్వారా సరకుల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. విశాఖ జిల్లాలో భూములకు విలువ ఎక్కువగా ఉండడంతో వాటి పరిరక్షణ, ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా జేసీని డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, పలువురు తహసీల్దార్లు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ముంబై ఐఐటీ నుంచి ఐఏఎస్‌కు

జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మయూర్ అశోక్ స్వస్థలం మహారాష్ట్రలోని పూణె. తండ్రి విద్యాశాఖాధికారి, తల్లి గృహిణి. అశోక్ ముంబై ఐఐటీ నుంచి బీటెక్ పట్టా తీసుకుని ఓలా కేబ్స్ మేనేజర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఆ తరువాత అరబ్ ఎమిరిటీస్ బ్యాంకులో కొంతకాలం పనిచేశారు. అనంతరం (2018లో) సివిల్స్ రాసి తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. బీహార్ కేడర్‌కు వెళ్లి అక్కడే ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పొందారు. మయూర్ అశోక్ సతీమణి కల్పనాకుమారి 2018 బ్యాచ్ ఏపీ కేడర్ అధికారి. దీంతో అశోక్‌ను కేంద్రం ఏపీ కేడర్‌కు బదలాయించింది. ఏపీకి వచ్చిన తరువాత తొలుత గుంటూరు జిల్లా తెనాలి సబ్ కలెక్టర్‌గా, తరువాత విజయనగరం జిల్లా హౌసింగ్ జేసీగా పనిచేశారు. జిల్లాల విభజన తరువాత 2022 ఏప్రిల్‌లో హౌసింగ్ జేసీ పోస్టులు ఎత్తివేయడంతో అదే జిల్లా రెగ్యులర్ జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. తాజా బదిలీల్లో విశాఖ జిల్లా జేసీగా బదిలీపై వచ్చారు. మయూర్ అశోక్ సతీమణి కల్పనాకుమారి పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణిగా పనిచేస్తున్నారు. సమాజానికి, ప్రధానంగా పేదలు, సామాన్యులకు సేవ చేసే అవకాశం ఉంటుందనే బ్యాంకు ఉద్యోగం వదిలి సివిల్స్ రాసి విజయం సాధించానన్నారు.

జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా విశ్వనాథన్ బాధ్యతల స్వీకారం



అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న విశ్వనాథన్

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా కేఎస్ విశ్వనాథన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను ప్రభుత్వం జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన విశ్వనాథన్‌కు జీవీఎంసీ అదనపు కమిషనర్-1 వై.శ్రీనివాసరావు స్వాగతం పలికి, ఆయనకు కేటాయించిన ఛాంబర్‌కు తీసుకువెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథన్‌ను కమిషనర్ అభినందించారు. కమిషనర్ ఛాంబర్‌లో ఇద్దరూ పది నిమిషాలపాటు మాట్లాడుకున్నారు. విశ్వనాథన్‌కు స్పందన, ఎకో వైజాగ్, యూసీడీ, హార్టికల్చర్, విద్య, ఉద్యోగుల గ్రీవెన్స్, వార్డు సచివాలయాల విభాగాల బాధ్యతలను కేటాయించారు.

భారత్, ఇంగ్లండ్ క్రికెటర్ల ముమ్మర సాధన

- రేపటి నుంచి టెస్ట్ మ్యాచ్



బౌలింగ్ చేస్తున్న రాబిన్‌సన్, పక్కన ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్



రోహిత్ శర్మ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 31: స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో రెండో తేదీ నుంచి జరగనున్న టెస్ట్ మ్యాచ్‌లో పాల్గొనే భారత్, ఇంగ్లండ్ జట్ల ఆటగాళ్లు బుధవారం ముమ్మర సాధన చేశారు. ఉదయం 9.30 గంటలకు ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్‌తోపాటు తొలి టెస్ట్‌లో భారీ సెంచరీ (196)తో చెలరేగిన పోప్, ఏడు వికెట్లతో భారత్ బ్యాటింగ్‌ను ఘోరంగా దెబ్బతీసిన ఎడమచేతి వాటం స్లో ఆర్థోడాక్స్ బౌలర్ హార్డ్లీ బెయిర్‌స్టో, ఫోక్స్, లీచ్, క్రాలే, జేమ్స్ అండర్సన్‌లు ప్రధాన స్టేడియం పక్కనున్న 'బి' గ్రౌండ్‌కు చేరుకుని బౌలింగ్, బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో భారత్ కెప్టెన్ రోహిత్‌శర్మతోపాటు బుమ్రా, అశ్విన్, అవేష్ ఖాన్, శ్రీకర్ భరత్, శ్రేయాస్ అయ్యర్, యశస్వి జైశ్వాల్, సర్ఫాజ్ ఖాన్, మహ్మద్ సిరాజ్, కులదీప్ యాదవ్, ముకేష్‌కుమార్, అక్షర పటేల్, సౌరబ్‌కుమార్, శుభమన్ గిల్, వాషింగ్టన్ సుందర్ వంటి ఆటగాళ్లు సాయంత్రం నాలుగు గంటల వరకు ముమ్మర సాధన చేశారు. ప్రాక్టీస్ అనంతరం ఇరుజట్ల ఆటగాళ్లు స్టేడియంను, పిచ్‌ను పరిశీలించారు.



స్టేడియంలో రాహుల్ ద్రవిడ్, అక్షర్ పటేల్

ప్రైవేటుకు ఉక్కు ఆస్పత్రి!?

తెర వెనుక సన్నాహాలు

- హుటాహుటిన ఢిల్లీకి స్టీల్‌ప్లాంటు డైరెక్టర్
- అక్కడి నుంచి ఆస్పత్రి వివరాలు సేకరణ
- ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన
- ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమన్న కార్మిక సంఘాల నేతలు
- ఆస్పత్రిని ఇతరులకు అప్పగించేందుకు రెండు దశాబ్దాలుగా యత్నాలు
- ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వస్తున్న కార్మికులు



స్టీల్ ప్లాంటు ఆస్పత్రి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వీర్యానికి రకరకాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. సొంత గనులు కేటాయించకుండా, ఆర్థిక సాయం అందకుండా అడ్డంకులు కల్పించిన కేంద్రం ఇప్పుడు ఉద్యోగులు, కార్మికులకు వైద్య సేవలు అందిస్తున్న జనరల్ ఆస్పత్రిని కార్పొరేట్ ఆస్పత్రులకు అప్పగించేందుకు పావులు కదుపుతోంది.

విశాఖ ఉక్కు కర్మాగారం 24 గంటలూ నడిచే పరిశ్రమ. ప్రతి షిఫ్టులో వేలాది మంది పనిచేస్తుంటారు. అప్పుడప్పుడు ప్రమాదాలు జరుగుతుంటాయి. తక్షణ వైద్య సేవలు అవసరం. ఇక స్టీల్‌ప్లాంటు టౌన్‌షిప్‌లో 20 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అలాగే కార్మికులు, సీఎస్ఎఫ్, హోంగార్డులు, నిర్వాసిత కాలనీ, చుట్టుపక్కల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు దశాబ్దాల కిందట 68 ఎకరాల విస్తీర్ణంలో 120 పడకల ఆస్పత్రిని ఏర్పాటుచేశారు. ఒకప్పుడు ఇందులో 400 మంది వైద్య సిబ్బంది పనిచేసేవారు. క్రమంగా ఆ సంఖ్యను సగానికి తగ్గించేశారు. ప్రస్తుతం 70 మంది డాక్టర్లు, ఇతర సిబ్బంది కలిపి 200 మంది ఉన్నారు. ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఈఎన్‌టి, డెంటల్, పాథాలజీ విభాగాలు ఉన్నాయి. నలుగురు జనరల్ సర్జన్లు ఉన్నారు. వీరు కాకుండా విశాఖపట్నం సిటీ నుంచి రోజూ ముగ్గురు స్పెషలిస్టులు (కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్) వస్తారు. రోజుకు సగటున ఐదు వందల మంది వరకూ ఈ ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకుంటారు. సమీప గ్రామాల వారు కూడా ఇక్కడికే రావడంతో నెలకు 200 డెలివరీలు చేస్తున్నారు. మేజర్ కేసులైతే సెవెన్‌హిల్స్, కేర్, ఇండస్, ఒమ్ని ఆర్‌కే తదితర ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు. ఏడాదికి జీతాలు, మందులు, బిల్లులకు కలిపి ఆస్పత్రిపై రూ.50 కోట్ల వరకూ వెచ్చిస్తున్నారు. ఇది భారంగా మారిందని వదిలించుకోవాలని చూస్తున్నారు. నగరంలోని విశాఖపట్నం పోర్టు ఇలాగే ఆస్పత్రిని ప్రైవేటుకు అప్పగించడంతో ఉక్కు యాజమాన్యం కూడా అదేబాటలో వెళ్లాలని యత్నిస్తోంది.

రెండు దశాబ్దాలుగా యత్నం

గత రెండు దశాబ్దాలుగా ఈ ఆస్పత్రి కోసం చాలామంది అనేక రకాలుగా ప్రయత్నాలు చేశారు. 1985లో ఆస్పత్రిని వెల్లూరు ఆస్పత్రికి ఇచ్చేయాలని యత్నించారు. అప్పుడు కార్మికులు కుటుంబాలతో సహా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయడంతో విరమించుకున్నారు. ఆ తరువాత నేదురుమల్లి జనార్దనరెడ్డి విశాఖపట్నం ఎంపీగా ఉన్నప్పుడు ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ వారికి ఈ ఆస్పత్రిని, భూమిని అప్పగిస్తే మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీతో పాటు ఆస్పత్రిని వేయి పడకలకు పెంచుతారని చెప్పి ఇవ్వడానికి యత్నించారు. అప్పుడు కూడా కార్మికులు అంగీకరించలేదు. ఇప్పుడు ఆస్పత్రితో పాటు పరిసరాల్లో 68 ఎకరాల భూములను దక్కించుకోవాలని కొన్ని కార్పొరేట్ ... మిగతా 6వ పేజీలో

అంగన్‌వాడీల్లో ఆందోళన

హామీలు ఇచ్చారు... జీవోలు మరిచారు

- ప్రధానమైన నాలుగు డిమాండ్లు నెరవేరుస్తామని చర్చల సందర్భంగా ప్రభుత్వ పెద్దల హామీ
- అందులో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించి జీవో మాత్రమే విడుదల
- మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు, అర్హులకు సంక్షేమ పథకాల వర్తింపు, వేతనాలు పెంపుపై కానరాని ఉత్తర్వులు
- ఇప్పటివరకూ యూనియన్ నాయకులకు అందని చర్చల మినిట్స్ కాపీ



మర్రిపాలెం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పెద్దల హామీ మేరకు సమ్మె విరమించిన అంగన్‌వాడీ సిబ్బంది...రెండు వారాలైనా అందుకు అనుగుణంగా జీవోలు విడుదల కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డిమాండ్లలో కీలకమైన నాలుగింటిని అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. కానీ అందులో ఒక్కదానికి సంబంధించి మాత్రమే ఇప్పటివరకూ జీవో విడుదలైంది. మిగిలిన మూడింటికి సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. ఇక చర్చల్లో భాగంగా డిమాండ్లను నెరవేరుస్తామని ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీకి సంబంధించి మినిట్స్ కాపీని కూడా అసోసియేషన్ నాయకులకు ఇవ్వలేదు. దీంతో అంగన్‌వాడీ సిబ్బందిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

అంగన్‌వాడీ సిబ్బందికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లక్షా రూ.20 వేలు ఇచ్చేందుకు చర్చల్లో ప్రభుత్వ పెద్దలు అంగీకరించారు. అలాగే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని, అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చారు. జూలై నుంచి వేతనాలను పెంచుతామని స్పష్టం చేశారు. అయితే, వీటిలో రిటైర్‌మెంట్ బెనిఫిట్‌కు సంబంధించిన జీవో మాత్రమే విడుదల చేశారు. మిగిలిన మూడు అంశాలకు సంబంధించిన జీవోలు విడుదల చేయలేదు. రెండు రోజుల్లోనే జీవోలు విడుదల చేస్తామని చర్చల సందర్భంగా ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చారు. కానీ, ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. అలాగే, సమ్మె ప్రారంభం నుంచి చర్చల వరకూ పది డిమాండ్లను అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు చర్చల్లో జరిగిన ఒప్పందానికి సంబంధించిన మినిట్స్ కాపీని యూనియన్ నాయకులకు అందిస్తామని ప్రభుత్వ ప్రతినిధులు చెప్పారు. ఇప్పటివరకు మినిట్స్ కాపీని అందించలేదు. ప్రతిరోజూ యూనియన్ నాయకులకు ఫోన్లు చేసి అంగన్‌వాడీ సిబ్బంది వీటిపై ప్రశ్నిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో మరోసారి ప్రభుత్వ పెద్దలను కలిసి వీటిపై స్పష్టత తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు భావిస్తున్నారు.

తొందరపాటు నిర్ణయమా?

సమ్మె విరమించిన తరువాత ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో సానుకూల స్పందన రాకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బందిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమ్మె విరమణ తొందరపాటు నిర్ణయమని, ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గడం వల్లే జీవోలు విడుదల, మినిట్స్ కాపీ అందించడంలో తాత్సారం చేస్తోందంటూ పలువురు సిబ్బంది అభిప్రాయపడు తున్నారు. ఒకసారి సమ్మె విరమించిన తరువాత చేసేదేమీ ఉండదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. దీనిపై సంఘ నాయకులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తేనే ఫలితం ఉంటుందని, లేకపోతే తరువాత పట్టించుకునేవారు ఎవరూ ఉండరని అంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందే జీవోలు వచ్చేలా అసోసియేషన్ నాయకులు యత్నించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అసోసియేషన్ నాయకులు రెండు రోజుల కిందట నగరంలో సమావేశం నిర్వహించారు.

తహసీల్దార్ల బదిలీ

ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లకు పైబడి పనిచేస్తున్న వారికి స్థానచలనం



- జిల్లా నుంచి విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు 18 మంది...
- ఆ జిల్లాల నుంచి 21 మంది రాక
- రెండు, మూడు రోజుల్లో పోస్టింగ్ ఇవ్వనున్న కలెక్టర్

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): **త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లాలో తహసీల్దార్లను ప్రభుత్వం బదిలీ చేసింది. మూడేళ్లు పైబడి పనిచేస్తున్న 18 మంది తహసీల్దార్లను జోన్-1లోని అవిభాజ్య విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు బదిలీ చేశారు. జిల్లాకు వచ్చి మూడేళ్లు దాటని ఇద్దరు తహసీల్దార్లను బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. అదే సమయంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 21 మంది తహసీల్దార్లను విశాఖ జిల్లాకు కేటాయిస్తూ బుధవారం భూపరిపాలనా ముఖ్య కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు.**

విశాఖ కలెక్టరేట్ పాలనాధికారి కేవీ ఈశ్వరరావు, 'ఈ' సెక్షన్ సూపరింటెండెంట్ పైలా రామారావు, ఆనందపురం, పద్మనాభం, ములగాడ తహసీల్దార్లు ఎల్.రామారావు, కె.వేణుగోపాల్, డి.వీరభద్రరావు, విశాఖ ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.మనోరంజని, భీమిలి ఆర్డీవో కార్యాలయ పాలనాధికారి జె.తారకేశ్వరి, భూపరిరక్షణ, భూసంస్కరణల తహసీల్దార్లు బీటీవీ రామారావు, ఎంవీకేఎస్ రవి, విశాఖ ఆర్డీవో కార్యాలయంలో భూసేకరణ ప్రత్యేక తహసీల్దార్ వి.శ్యాంకుమార్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న పి.నాగజ్యోతిలను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. అలాగే కలెక్టరేట్‌లో 'ఎఫ్' సెక్షన్ సూపరింటెండెంట్ వి.సుజాత, గోపాలపట్నం, సీతమ్మధార తహసీల్దార్లు కె.జయ, ఎం.ఆనందకుమార్‌లను పార్వతీపురం మన్యం జిల్లాకు, భీమిలి, విశాఖ రూరల్, పెందుర్తి, పెదగంట్యాడ తహసీల్దార్లు ... మిగతా 6వ పేజీలో

రేంజ్‌లో 14 మంది సీఐల బదిలీ

వేకెన్సీలో ఉన్న, పదోన్నతి పొందిన వారికి పోస్టింగ్



విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విశాఖ రేంజ్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల పర్వం కొనసాగుతుంది. సీనియర్లతోపాటు తాజాగా సీఐలుగా పదోన్నతి పొందిన అధికారులకు పోస్టింగ్స్ ఇస్తూ రేంజ్ డీఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రేంజ్ వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు సి.సూర్యనారాయణకు శ్రీకాకుళం జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎక్స్)లో, అడబాల రవికుమార్‌కు విజయనగరం జిల్లా భోగాపురం యూపీఎస్‌లో, ఏవీ లీలా రావుకు విజయనగరం జిల్లా ట్రైనింగ్ సెంటర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఇంకా సాలూరు రూరల్ సీఐ ఎస్.ధనుంజయ రావును అనకాపల్లి రూరల్ స్టేషన్ సీఐగా, పార్వతీపురం మన్యం జిల్లా కొటియా సీఐ బి.రోహిణిపతిని అదే జిల్లాలో స్పెషల్‌బ్రాంచి (ఎక్స్)కు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సీఐ నమ్మి గణేష్‌ను జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, విజయనగరం ట్రైనింగ్ సెంటర్‌లో ఉన్న ఎం.చంద్రశేఖర్‌ను విశాఖ రేంజ్‌కు పంపారు. తాజాగా పదోన్నతి పొంది పోస్టింగ్ కోసం రేంజ్‌లో ఎదురుచూస్తున్న గేదెల బాల కృష్ణను పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు రూరల్ సీఐగా, కింతల నారాయణరావును కొటియా సీఐగా, ముదిలి శ్రీనివాసరావును విజయనగరం రూరల్ సీఐగా, డి.దీనబంధును అనకాపల్లి దిశ స్టేషన్ సీఐగా, టి.క్రాంతి కుమార్‌ను అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సీఐగా, ఎస్.సన్యాసినాయుడిని అల్లూరి జిల్లా పాడేరు సీఐగా, బమ్మిడి అప్పలనాయుడును గూడెంకొత్తవీధి సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా జ్ఞానవేణి

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కె.జ్ఞానవేణిని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించింది. విశాఖపట్నంలో ఏపీఐఐసీ ఎస్డీసీగా ఉన్న టీఎంఈ రాజును ఏలూరు జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో నీటి పారుదల శాఖలో పనిచేస్తున్న జీవీ సత్యవాణిని నియమించింది. విశాఖ ఉక్కు భూసేకరణ ఎస్డీసీ జేవీఎస్ రామ్మోహన్‌రావును శ్రీకాకుళం జిల్లా హిరమండలం భూసేకరణ ప్రాజెక్టు యూనిట్-4 ఎస్డీసీగా బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న జి.జయాదేవిని విశాఖ జిల్లాలో ఖాళీగా ఉన్న ఐసీడీఎస్ పీడీగా నియమించింది. జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి డి.ప్రమీలాగాంధీకి బొబ్బిలిలో భూసేకరణ ప్రాజెక్టు ఎస్డీసీగా బదిలీ కాగా, ఆమె స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా ఎల్విన్‌పేటలో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సీహెచ్ గౌతమికుమారి నియమితులయ్యారు. సింహాచలం దేవస్థానం భూపరిరక్షణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మిని కాకినాడ సెజ్‌కు బదిలీ చేసి, ఆమె స్థానంలో ఏలూరులో పీఐపీఆర్ఎంసీ ఎస్డీసీగా పనిచేస్తున్న కెగీతాంజలిని నియమించారు.



డీసీపీ-1గా మణికంఠ చందోలు బాధ్యతలు స్వీకారం

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ-1గా వీఎన్ మణికంఠ చందోలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అదనపు ఎస్పీగా పనిచేస్తున్న ఆయన్ను విశాఖ డీసీపీ-1గా నియమిస్తూ ప్రభుత్వం రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం డీసీపీ-1గా పనిచేస్తున్న కంచి శ్రీనివాసరావు నుంచి కొత్త డీసీపీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ రవిశంకర్‌అయ్యన్నార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

కరాటేలో చిన్నారికి స్వర్ణ పతకాలు



జాతీయస్థాయిలో పతకం సాధించిన నిఖిలశ్రీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 31: జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన పదేళ్ల చిన్నారి ఎం.నిఖిల శ్రీ రెండు స్వర్ణ పతకాలు సాధించింది. గోవాలో జపాన్ కరాటే అసోసియేషన్ నిర్వహించిన ఈ టోర్నీలో నిఖిలశ్రీ అండర్-12 బాలికల కేటగిరిలో ప్రాతినిధ్యం వహించి కుమితే ఈవెంట్‌లో స్వర్ణ పతకం, కటా ఈవెంట్‌లో మరో స్వర్ణం సాధించి నిపుణులను ఆకర్షించింది. జాతీయ పోటీల్లో పతకాలు సాధించడంతోపాటు బ్లాక్ బెల్ట్ డిప్లమో పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో త్వరలో జపాన్‌లో జరగనున్న అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. నగరంలోని జపాన్ మాస్టర్ సెన్‌సాయి ఆర్.మోహన్ వంశీసాయి వద్ద శిక్షణ పొందుతున్న నిఖిలశ్రీ సాధించిన విజయాలపై చీఫ్ ఇన్‌స్ట్రక్టర్లు ఆర్.బాలరాజు, కృష్ణప్రియ అభినందించారు.

పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి సన్మానం



పదవీ విరమణ చేస్తున్న ఏఎస్‌ఐలతో కమిషనర్

మహరాణిపేట, జనవరి 31: నగర పరిధిలో పదవీ విరమణచేసిన పోలీసు సిబ్బందికి కమిషనర్ ఏ రవిశంకర్ ఆధ్వర్యంలో బుధవారం సన్మాన కార్యక్రమం జరిగింది.కమిషనరేట్‌లో పదవీ విరమణ చేసిన ఆర్ఎస్ఐ ఆర్. వెంకటరావు , ఏఎస్‌ఐలు బీ.వి. నాగభూషణరావు, టి. తారకేశ్వరరావు, కె. వాసు, పి.వి. శ్రీనివాసరావులు, వారి కుటుంబ సభ్యులను సన్మానించారు.

'టీడీపీ- జనసేన గెలుపునకు కృషి'



ప్రచారంలో పాల్గొన్న జనసేన పార్టీ నాయకులు

సీతమ్మధార, జనవరి 31: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు సహకరించాలని జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 24వ వార్డు గాంధీనగర్‌లో ఇంటింటికీ జనంలోకి జనసేన ప్ర చార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రస్తుత జగన్‌ప్రభుత్వం అరాచకాలను ప్రజలకు తెలపాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అమరాపు దుర్గా, సంకు వెంకటేశ్వరావు, త్రివేణి, గోపికళ్యాణ్, అడబాల నాని, భాస్కర్, సూకరాజు, నాగమణి, కృష్ణ, దివాకర్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



ముత్యమాంబ గుడి వద్ద నిలిచిపోయిన వాహనాలు



కంచరపాలెం మెట్టు వద్ద ట్రాఫిక్ పరిస్థితి

ట్రాఫిక్ జామ్‌తో సహనానికి పరీక్షే..

- కంచరపాలెం రోడ్డులో అవస్థలు
- మెట్టు, ఊర్వశి జంక్షన్‌లలో పరిస్థితి దారుణం
- డివైడర్లు, బారికేడ్లతో సమస్య జటిలం... ప్రయాణికులకు యాతన

కంచరపాలెం, జనవరి 31 : పద్మవ్యూహంలో అభిమన్యుడు చిక్కుపోయిన కథ అందరికీ తెలిసిందే.. దీనికి దీటుగా కంచరపాలెం రోడ్డులో వాహనచోదకులు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఏ వాహనం ఎటువైపు వస్తుందో... ఎక్కడ అడ్డంకులుంటాయో తెలియని పద్మవ్యూహంలో ముందుకు సాగుతుంటారు. నిత్యం ఇక్కడి ట్రాఫిక్ సమస్య సహనానికి పరీక్షగా నిలుస్తోంది. కంచరపాలెం మెట్టు వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ తో అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఇరుకు రోడ్డు...ఆపై ఎక్కడికక్కడ డివైడర్లను అడ్డుపెట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు మరింత అధికమవుతున్నాయి. కంచరపాలెం మెట్టు, ఊర్వశి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేశారు. అయితే, యూ టర్న్ తీసుకోవడానికి కూడా అవకాశం లేనంతగా ఇరుకురోడ్లలో డివైడర్లు, బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి. బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇతర వాహనాలు చొరబడకుండా ఒకవైపు బారికేడ్లు పెట్టి మూసివేశారు. సర్వీస్ రోడ్డులో ఇష్టానుసారం ఆక్రమణలు, ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసి వదిలేయడంతో ట్రాఫిక్ జామ్ నెలకొంటోంది. మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ వరకు సర్వీస్ రోడ్డులో ముందు ఆక్రమణలు, ఇష్టానుసారం వాహనాల పార్కింగ్ నిరోధించగలిగితే వాహనాల రాకపోకలు సజావుగా సాగుతుందని అభి ప్రాయం సర్వ త్రా వ్యక్తమవుతోంది. దిశగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. మెట్టు వద్ద నిత్యం నెలకొంటున్నట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఊర్వశి జంక్షన్ వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కున్న వాహనాలు

జేసీగా విశ్వనాథన్ సేవలు ప్రశంసనీయం

- బదిలీ వీడ్కోలు సభలో కలెక్టర్ మల్లికార్జున



విశ్వనాథన్‌కు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్

మహరాణిపేట, జనవరి 31: చక్కటి పనితీరుతో అందరి మనసులు గెలుచుకున్న జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్ సేవలు ప్రశంసనీయని కలెక్టర్ ఏ మల్లికార్జున్ అన్నారు. జేసీగా పనిచేసిన విశ్వనాథన్ జీవీఎంసీ ఏడీసీపీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఆయనకు దసపల్లా హోటల్‌లో రెవెన్యూ అసోసియేషన్, జిల్లాయంత్రాంగం సంయుక్త ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. అధికారులు ఆయనకు సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విశ్వనాథన్‌తో తమకు అనుబంధాలను పంచుకున్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, డీఆర్‌వో కె. మోహనకుమార్, ఆర్‌డీవో హుస్సెన్ సాహెబ్, ఏవో ఈశ్వరరావు ఉన్నారు.

ఆసరా పథకం చెక్కుల పంపిణీ

పూర్ణామార్కెట్, జనవరి 31: టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణంలో ఆసరా పథకం నిధుల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ ఈ చెక్‌లు లబ్ధిదారులకు అందించారు. దక్షిణ నియోజకవర్గంలో పలువురు డ్వాక్రా మహిళలకు ఈసారి చేయూత పథకంలో కోత విధించడంతో సర్వ త్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. కరెంట్ బిల్లులు అధికంగా వచ్చాయని పేర్కొంటూ చాలా మందికి పథకాన్ని దూరం చేయడంపై పలువురు ఈసందర్భంగా ఆగ్రహం వ్యక్తంచేయడంకనిపించింది.

సమష్టిగా ఉత్తమ సేవలందించాలి

సీతమ్మధార, జనవరి 31: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా ప్రజలకు ఉత్తమ సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ప్రభుత్వ నిధులు, దాతలు ఆర్థిక సహాయంతో ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ సిబ్బందితోపాటు ప్రజల సౌకర్యార్థం అదనపు వసతులతో భవనాన్ని సమకూర్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలందించాలని అధికారులు, సిబ్బందికి సూ చించారు. ఈ కార్య క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, రెవెన్యూ అధికారులు, దాతలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, అధికారులు

సీపీఐ నేత సుబ్బరాజు మృతి తీరని లోటు

అల్లిపురం, జనవరి 31: సీపీఐ సీనియర్ నాయకుడు, జాతీయ బ్యాంకుల యూనియన్ పూర్వ నేత కామ్రేడ్ కె.వి. సుబ్బరాజు అకాల మృతి అటు కార్మిక వర్గానికి తీరని లోటని సీపీఐ రాష్ట్రసహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి విచారం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో సుబ్బరాజు భౌతికకాయానికి జరిగిన అంత్యక్రియల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజుతో కలసి పాల్గొని ఆయననివాళులర్పించారు. అనంతరం ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. స్థానిక జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు జె.ఎస్.జె. అచ్యుతరావు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, కె.సత్యంజనేయ, ఎస్.కె. రెహమాన్, పి.చంద్రశేఖర్,క్షేత్రపాల్, వరలక్ష్మి, ఎర్రయ్యరెడ్డి, బి.సి. హెచ్. మసేన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో తికమక

- నేడు పార్లమెంటు కార్యాలయం ప్రారంభం
- ఇప్పటికే జీవీఎల్ ఆధ్వర్యంలో ఒక కార్యాలయం

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలోని 25 జిల్లాల్లో గురువారం పార్లమెంటు కార్యాలయాల ప్రారంభానికి సిద్ధమైంది. అందులో భాగంగా విశాఖపట్నం పార్లమెంటు కార్యాలయాన్ని లాసన్స్‌బే కాలనీలో గల పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి తపన చౌదరి, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు హాజరవుతున్నారు. ఇదిలావుండగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచి లోక్‌సభకు పోటీ చేయాలనే ఉద్దేశంతో ఇప్పటికే లాసన్స్‌బే కాలనీలో ఓ కార్యాలయాన్ని నడుపుతున్నారు. మొదట్లో బీజేపీ కార్యాలయంలోనే కార్యక్రమాలు నిర్వహించి, ఆ తరువాత దానికి ఎదురుగానే ఓ భవనంలో సొంత కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. ఆయన ఏ కార్యక్రమం చేపట్టినా 'బీజేపీ' పేరుతో కాకుండా "జీవీఎల్" బ్రాండ్ పేరుతో నిర్వహిస్తున్నారు. 'జీవీఎల్ కార్యాలయం', 'జీవీఎల్ సంక్రాంతి వేడుకలు', 'జీవీఎల్ రిపబ్లిక్ రన్'...ఇలా చేసుకుంటూ పోతున్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో బీజేపీ తరఫున రెండు పార్లమెంటు కార్యాలయాలు నడిచే సూచనలు కనిపిస్తున్నాయి. ఢిల్లీ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చేంత వరకు ఈ వ్యవహారాలు కొనసాగుతాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు: సీపీ



కమిషనరేట్‌లో జరిగిన సమీక్షలో అధికారులు

మహారాణిపేట, జనవరి 31: నగరంలో క్రైమ్ రేటు తగ్గేలా రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరంగా చేపట్టాలని నగర పోలీసు కమిషనర్ ఏ రవి శంకర్ ఆదేశించారు. పోలీసు శాఖ పని తీరుపై బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు ఉన్నత అధికారులు, లీగల్ అడ్వయిజర్లతో పాటు ఏడీసీపీలు, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, క్రైమ్, స్పెషల్ బ్రాంచిలపై వేర్వేరుగా కమిషనర్ సమీక్ష చే శారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చెక్‌పోస్టులపై నిఘా పటిష్టంచేయాలని ఆయన కోరారు. అన్నివాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్య క్రమాలు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అన్ని పోలీసు స్టేష న్లలో నమోదైన కేసుల తీరు, వివరాలు తదితర అంశాలను పరిశీలించారు. మహిళల వేధింపులు, మిస్సింగ్ కేసులపై ఎటువంటి జాప్యం లేకుండా స్పందిం చాలన్నారు.

పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, జనవరి 31: స్టీల్‌ప్లాంట్, కార్మికుల కోసం అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,084వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 నెలలుగా కార్మికులు, ప్రజలు, బీజేపీ మినహా మిగతా రాజకీయ పక్షాల మద్దతుతో పోరాటాలు చేస్తున్నా కేంద్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుందన్నారు. గాంధేయవాదాన్ని బలపరుస్తున్న కేంద్ర ప్రభుత్వం గాంధేయ మార్గంలో జరుగుతున్న పోరాటాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎలాంటా త్యాగాలకైనా సిద్ధమని పేర్కొ న్నారు. ఇప్పటికైనా కేంద్రం తమ నిరంకుశత్వాన్ని విడనాడకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

9వ తేదీ వరకు 'డ్వాక్రా బజారు'



ఎగ్జిబిషన్‌లో కొనుగోలుదారులు

మహారాణిపేట, జనవరి 31: డ్వాక్రా మహిళలు, చేనేత కార్మికులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించాలనే ఆలోచనతోనే డ్వాక్రా బజారు పేరిట ఈనెల 9వ తేదీ వరకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్టు నిర్వాహకుడు మహేశ్ తెలిపారు. బుధవారం బీచ్ రోడ్డులోని విశ్వ ప్రియా ఫంక్షన్ హాల్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ పొందూరు, బెంగాల్, పోచంపల్లి, గద్వాల్, కాశ్మీర్, జైపూర్ తదితర ప్రాంతాల మహిళలు, చేతివృత్తిదారులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయన్నారు.

స్పెషల్ బ్రాంచ్ అదనపు డీసీపీగా వెంకటరావు

మహారాణిపేట, జనవరి 31: నగర పోలీసు కమిషనరేట్ స్పెషల్‌బ్రాంచ్ అ దనపు డీసీపీగా ఎస్. వెంకటరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఆస్థానంలో పనిచేస్తున్న నాగేంద్రుడుని ఏసీబి అదనపు ఎస్పీగా బదిలీ చేసింది. వెంకటరావు ప్రస్తుతం విజయనగరం సబ్ అడిషనల్ ఎస్పీగా పని చేస్తు న్నారు ఎన్నికల సమయం కావటంతో నగరంలో జరిగే ప్రతీ సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ఆయనను నియమించింది.

ఇద్దరు సూపరింటెండెంట్లపై యాక్షన్

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు సూపరిం టెండెంట్లపై ఆర్డీ చర్యలు తీసుకున్నారు. హెల్త్ అసిస్టెంట్ల నియామకాలు, రెగ్యులరైజేషన్ వ్యవహారంలో డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు రావడంతో వీరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ఆదేశాలతో సదరు అధికారులపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ అక్కడి జిల్లా వైద్య, శాఖ అధికారులు విశాఖలోనిఆర్డీ కార్యాలయానికి ఈ నెల 25న మెయిల్ ద్వారా సమా చారాన్ని అందించారు. అయితే, ఇక్కడి అధికారులు తాత్సారం చేస్తూ వారికి మేలు చేసేలా వ్యవహరించేందుకు యత్నించారు. ఈ విషయాన్ని పలువురు ఆర్డీ దృష్టికి తీసుకువెళ్లగా వారిపై చర్యలు తీసుకున్నారు. సదరు అధికారులను సస్పెండ్ చేస్తూ ఆర్డీ బుధవారం ఆదేశాలు జారీచేశారు.

కేంద్ర ప్రభుత్వ లైఫ్ మిషన్‌కు ఏపీఈఆర్‌సీ మద్దతు

- చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవల ప్రారంభించిన ట్రాన్స్‌ఫర్మేటివ్ లైఫ్ మిషన్‌కు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సంపూర్ణ మద్దతు ప్రకటించినట్టు ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థలు సమర్పించిన ఆదాయ అంచనాల ప్రతిపాదనలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ బుధవారంతో ముగిసింది. విశాఖపట్నం ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 20 మంది తమ అభ్యంతరాలను వ్యక్తంచేశారు. విద్యుత్ వినియోగదారుల గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లు పెట్టాలనే ప్రతిపాదనలు విరమించుకోవాలని, విద్యుత్ చార్జీలు కాకుండా అదనంగా మోపుతున్న ఇతర భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై ఛైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచిస్తామని చెప్పారు. అభిప్రాయ సేకరణలో వచ్చిన అభ్యంతరాలపై విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు పృథ్వీతేజ్, కె.సంతోష్‌రావు, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర వివరణలు ఇచ్చారు. ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు విద్యుత్ రంగంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలను చదివి వినిపించారు. విద్యుత్ చట్టం 2003కు అనుగుణంగా ప్రభుత్వం ఆయా రంగాల వినియోగదారులకు రాయితీపై విద్యుత్‌ను అందించడానికి అవసరమైన నిధులు కేటాయిస్తుందన్నారు.



మిషన్‌లైఫ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాఖపట్నం, జనవరి 31: రైల్వే స్టేషన్ గేట్ నంబరు మూడు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. బుధవారం ఉదయం సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులకు ఘటన స్థలం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుని వయస్సు 60 నుంచి 65 ఏళ్లు ఉంటాయని, జీన్ ప్యాంట్ పింక్ కలర్ షర్టు ధరించి ఛామన చాయ రంగులో ఉన్నారని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారు జీఆర్పీ ఎస్‌హెచ్‌వో ధనుంజయనాయుడు ఫోన్:9440627547, ఎస్ఐ జి.శ్రీనివాసరావు ఫోన్:9866413487 సమాచామివ్వాలి.

వృద్ధురాలికి వలంటీర్లు టోకరా

- బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు తస్కరణ
- కాపు నేస్తం, కులగణన సర్వే పేరుతో వేలి ముద్ర సేకరణ
- పోలీసులకు ఫిర్యాదు మరో ఇద్దరితో కలిసి మోసానికి పాల్పడినట్టు అంగీకరించిన వలంటీర్లు

ఎస్.రాయవరం (అనకాపల్లి జిల్లా), జనవరి 31: గ్రామ వలంటీర్లు కుల గణన సర్వే పేరుతో ఓ వృద్ధురాలి నుంచి వేలిముద్రలు నమోదు చేయించుకుని, ఆమె బ్యాంకు ఖాతా నుంచి పది వేల రూపాయలను కొట్టేసిన సంఘటన అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం జేవీపాలెంలో చోటుచేసుకుంది. వలంటీర్లు జనవరి 21వ తేదీన మోసానికి పాల్పడగా, ఈ విషయాన్ని ఆమె 30వ తేదీన గుర్తించారు. వలంటీర్ల మోసాన్ని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి, బుధవారం పోలీసులకు పిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి బాధితులు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

ఎస్.రాయవరం మండలం జేవీ పాలెం గ్రామానికి చెందిన ఎద్దు లక్ష్మి (60) ఒంటరిగా నివాసం ఉంటున్నారు. గ్రామానికి చెందిన నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్ అనే వలంటీర్లు లక్ష్మి ఈ నెల 21వ తేదీన లక్ష్మి ఇంటికి వెళ్లారు. కాపు నేస్తం, కులగణన సర్వే నిర్వహించడానికి వచ్చామని చెప్పారు. ఆమె నుంచి పలు వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. అనంతరం ఒక డివైజ్‌లో ఆమె వేలి ముద్రలు నమోదు చేసుకుని వెళ్లిపోయారు. ఇదిలావుండగా కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన కింద లక్ష్మికి పక్కా ఇల్లు మంజూరైంది. నిర్మాణంలో వున్న ఈ ఇంటికి సంబంధించి బిల్లు మంజూరు కోసం ఆమె 29వ తేదీన హౌసింగ్ ఏఈని కలిశారు. డబ్బులు జమ అయ్యింది, లేనిదీ బ్యాంకుకు వెళ్లి తెలుసుకోవాలని ఏఈ బదులిచ్చారు. లక్ష్మి 30వ తేదీన ఎలమంచిలిలో వున్న ఏపీ గ్రామీణ వికాస బ్యాంకుకు వెళ్లి వాకబు చేశారు. ఈ మధ్య కాలంలో డబ్బులు ఏమీ జమ కాలేదని, అయితే ఈ నెల 21వ తేదీన ఖాతా నుంచి రూ.10 వేలు తీసినట్టు వుందని బ్యాంకు సిబ్బంది చెప్పారు. దీంతో ఆమె మేనేజర్‌ను కలిసి తన ఖాతా నుంచి ఎవరికి డబ్బులు వెళ్లాయో చెప్పాలని కోరారు. మేనేజర్ తనిఖీ చేసి సైతారుపేట గ్రామానికి చెందిన వీసం రామసోమనాయుడు (బ్యాంకు కరస్పాండెంట్) అనే వ్యక్తి ఖాతాకు జమ అయినట్టు చెప్పారు. ఆ రోజు (21వ తేదీ) తన వద్ద వేలి ముద్రలు తీసుకున్న వలంటీర్లపై అనుమానం వచ్చి ఆమె ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ నాయకుడు వజ్రపు శంకరరావుకు చెప్పారు. ఆయన బుధవారం లక్ష్మిని వెంటబెట్టుకుని పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి కూడా తీసుకువెళ్లారు. అనంతరం వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్‌తోపాటు సైతారుపేటకు చెందిన వీసం రామసోమనాయుడు పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు విచారించగా..బ్యాంకు కరస్పాండెంట్ రామసోమనాయుడు వద్ద వుండే డివైజ్‌లో లక్ష్మి వేలి ముద్రను నమోదు చేసుకుని, ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలను బదలాయించినట్టు వలంటీర్లు చెప్పారు. వీరికి వేమగిరి గ్రామానికి చెందిన వై.రవి సహకరించినట్టు తెలియడంతో అతడిని కూడా రప్పించి విచారించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు వజ్రపు శంకరరావు మాట్లాడుతూ, వృద్ధురాలిని మోసగించి డబ్బులు తస్కరించిన వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్, వీరికి సహకరించిన వీసం రామసోమనాయుడు, వై.రవిలపై కేసు నమోదు చేయాలని, వలంటీర్లను విధుల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఎస్ఐ విభీషణరావును వివరణ కోరగా..కుల గణన సర్వే కోసం వచ్చిన వలంటీర్లు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు అపహరించినట్టు ఎద్దు లక్ష్మి ఫిర్యాదు చేశారని, ఇంకా కేసు నమోదు చేయలేదని బదులిచ్చారు.

ప్రైవేటుకు ఉక్కు ఆస్పత్రి!?...

5వ పేజీ తరువాయి

ఆస్పత్రులు యత్నిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలో పైరవీలు జరుగుతున్నాయి. ఏమైందో తెలియదు గానీ ఇక్కడి స్టీల్ ప్లాంటు డైరెక్టర్ ఒకాయన రెండు రోజుల క్రితం హుటాహుటిన రెండు రోజుల క్రితం ఢిల్లీ వెళ్లారు. అక్కడి నుంచి ఆస్పత్రికి సంబంధించిన వివరాలు తీసుకున్నారు. ప్రైవేటుకు అప్పగిస్తే ఎలా ఉంటుందనే దానిపై చర్చలు జరుగుతున్నాయనే విషయం స్టీల్‌ప్లాంటు ఉద్యోగ వర్గాలకు, కార్మిక వర్గాలకు తెలియడంతో వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించం

డి.ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి, ఉక్కు గుర్తింపు సంఘం

స్టీల్ తయారీ రంగం నిరంతరం పనిచేయాల్సిన పరిశ్రమ. విశాఖపట్నం పోర్టు ఆస్పత్రిలా ఇక్కడ చేయడానికి వీలు కాదు. 24/7 ఆస్పత్రి పనిచేయాల్సిందే. ప్రైవేటుకో, అవుట్ సోర్సింగ్‌కో ఇస్తామంటే ఒప్పుకోం. ఇక్కడికి ఎవరు వచ్చినా భూముల కోసమేనని అందరికీ తెలిసిందే. ప్రైవేటు ఆస్పత్రులు వస్తే బిల్లులు పెరిగిపోతాయి. అది మళ్లీ ప్లాంటుకే భారం.

తహసీల్దార్ల బదిలీ

... 5వ పేజీ తరువాయి

సీహెచ్‌వీ రమేష్, ఎస్.రమణయ్య, పి.శ్యామ్‌ప్రసాద్, పి.రమాదేవిను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. జిల్లాకు వచ్చి మూడేళ్లు పూర్తికాని మహారాణిపేట, గాజువాక తహసీల్దార్లు ఆనందకుమార్, శ్రీవల్లీలకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. తాజా బదిలీల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి శ్రీకాకుళం తహసీల్దారు ఎన్.వెంకటరావు, నెల్లూరులో ఏపీ మారిటైమ్ బోర్డులో పనిచేస్తున్న వై.జయలక్ష్మి, విజయనగరం జిల్లా మెంటాడ, జామి, కొత్తవలస, భోగాపురం, పూసపాటిరేగ, గరివిడి, మెరకముడిదాం, బలిజిపేట, సీతానగరం తహసీల్దార్లు టి.రామకృష్ణ, జి.హేమంత్‌కుమార్, శ్రీనివాస మిశ్రా, సీహెచ్ బంగార్రాజు, జి.భాస్కరరావు, టి.గోవింద్, పి.విజయభాస్కర్, పి.అప్పలరాజు, ఎన్వీ రమణలను విశాఖ జిల్లాకు కేటాయించారు. విజయనగరం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న బీఎస్ దేవీప్రసాద్, బి.నీలకంఠరావు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఆర్.ఉమామహేశ్వరరావు, జి.శ్రీరామమూర్తి, డి.రవి, ఎం. రమణమ్మ, ఎన్.భాస్కరరావు, పార్వతీపురం ఆర్డీవో కార్యాలయ పాలనాధికారి వి.రామస్వామి, పార్వతీపురం, సాలూరు, కొమరాడ తహసీల్దార్లు ఎన్.శ్రీమన్నారాయణ, ఆర్.బాలమురళీకృష్ణ, ఎం.భుజంగరావులను విశాఖ జిల్లాకు బదిలీ చేశారు. వీరందరికీ విశాఖ జిల్లా కలెక్టర్ పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఇందుకు రెండు, మూడు రోజుల గడువు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

అభివృద్ధి పనులకు మేయర్, ఎమ్మెల్యే శంకుస్థాపన

గాజువాక, జనవరి 31: జీవీఎంసీ 73వ వార్డులో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బుధవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అన్ని వార్డుల్లో పలు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా తాము ముందుకు వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉరుకూటి చందు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిపై ప్రస్తావన

కాగా ఈ సమావేశంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత మాట్లాడుతూ.. గాజువాక వైసీపీ టికెట్‌ను ప్రస్తుత ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి ఇవ్వని పక్షంలో కుల ప్రాతికదికగా తీసుకుని మేయర్ హరి వెంకటకుమారికి ఇవ్వాలని ప్రస్తావించారు. దీంతో ఈవిషయం చర్చనీయాంశంగా మారింది. ఆ సమావేశంలో ఉరుకూటి చందు పాల్గొన్నప్పటికీ కార్పొరేటర్ ఈవిధంగా మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

కూర్మన్నపాలెం, జనవరి 31: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. బుధవారం రాత్రి కణితిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పలు కాలనీల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబుకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసీపీ ప్రభుత్వం కేసులు పెడుతుందన్నారు. ప్రజలను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయరామరాజు, పీవీవీఎస్ మూర్తి, పి.దానయ్య, డీవీ అప్పారావు, బి.రాంబాబు, సత్తిబాబు, రాజన్‌రాజు, జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజ సంకీర్తనలు

అగనంపూడి, జనవరి 31: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కర్ణాటక సంగీత విద్వాంసులు త్యాగరాజు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం వసుంధర భజన మండలి ఆధ్వర్యంలో ఆలపించిన త్యాగరాజ కీర్తనలు అందరినీ అలరించాయి. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి, కమిటీ ప్రతినిధులు సాయిబునాయుడు, ఉమామహేశ్వరరావు, నరసింగరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి సీఐగా రామకృష్ణ

పెందుర్తి, జనవరి 31: పెందుర్తి సీఐగా ఎల్. రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ మరిడాన శ్రీనివాసరావు గాజువాక స్టేషన్‌కు బదిలీ అయ్యారు. స్టేషన్ చార్జి తీసుకున్న సీఐ రామకృష్ణ ఈసందర్భంగా మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు సిబ్బంది, ప్రజల సహకారంతో కృషి చేస్తానన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పోలీసు స్టేషన్ పరిధి తెలుసుకున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణ

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హైవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు19, టమాటా 26, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 50, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 16, క్యారెట్ 20, దొండకాయలు 26, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 115, బరబాటి 28, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 48 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 56, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, క్యాప్సికమ్ 20, మామిడిఅల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1 లో..



వుడా నగర్‌లో బస్సుల కోసం ఎండలో వేచివున్న విద్యార్థులు



శ్రీనగర్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో బస్సుల కోసం నిరీక్షిస్తూ..

నిలువ నీడ లేక.. ఎండకు తాళలేక..

71, 86 వార్డుల్లో బస్ షెల్టర్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు

ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

కూర్మన్నపాలెం, జనవరి 31: జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్, 86వ వార్డు వుడా ఫేజ్-1లలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులకు నీడ కరువై మండుటెండల్లో వేచివుండడం నిత్యకృత్యంగా మారింది. ప్రజా సంక్షేమమే మా ధ్యేయమని చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం బస్సుల కోసం వేచివుండేందుకు కనీసం షెల్టర్లను సైతం నిర్మించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండ, వానల బారినపడుతూ నడిరోడ్డుపైనే నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా శ్రీనగర్ నుంచి పాత గాజువాక జంక్షన్ వైపు వెళ్లే రహదారి, చినగంట్యాడ జంక్షన్, వడ్లపూడి కూడలని, ముస్తఫా జంక్షన్, ఫకీర్‌తఖియా, వుడా ఫేజ్- ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు నానాపాట్లు పడుతున్నారు. దీంతో రోడ్ల పక్కన ఉన్న డివైడర్లపై, చెట్ల కింద, దుకాణాల పక్కన బస్సుల కోసం నిల్చోవలసిన పరిస్థితి నెలకొంది. బస్ షెల్టర్ల ఏర్పాటు పట్ల ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు.



శ్రీనగర్‌లో చెట్ల నీడన బస్సుల వేచివున్న ప్రయాణికులు

మరోపక్క బస్సుల కోసం వేచివున్న ప్రాంతాల్లో కాకుండా దూరంగా ఆయా ఆర్టీసీ సర్వీసులను ఆపుతుండడంతో పరుగులు పెట్టి వాటిని ఎక్కాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. కనీసం ఆయా ప్రాంతాల్లో బస్సులు నిలిపే ప్రదేశం అనే బోర్డులను కూడా ఏర్పాటు చేయకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించి ఆయా కూడళ్లలో బస్ షెల్టర్ల ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

-కె.సహదేవ్, ప్రయాణికుడు, శ్రీనగర్



బస్ షెల్టర్ లేకపోవడంతో రహదారులపై ఆర్టీసీ సర్వీసుల కోసం ఎండ, వానల్లో వేచివుండాల్సి వస్తుంది. ప్రయాణికుల సౌలభ్యమే మా లక్ష్యమని చెప్పే ఆర్టీసీ యాజమాన్యం బస్ షెల్టర్ల ఏర్పాటుపై దృష్టిపెట్టడం లేదు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బస్ షెల్టర్లు నిర్మించాలని కోరుతున్నాం.

చెత్తపై పన్ను వేసిన సీఎంను సాగనంపాలి

జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు

శ్రీనగర్, జనవరి 31: చెత్తపై పన్ను వేసిన తొలి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని సాగనంపాలని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో బుధవారం రాత్రి జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు చైతన్య ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర శ్రీనగర్, శ్రీరాంనగర్, విశ్వేశ్వరాయనగర్, సుందరయ్య కాలనీల్లో సాగింది. ఈ సందర్భంగా కోన తాతారావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలను పెంచారని, నిత్యావసర సరకుల ధరలు కూడా నానాటికీ పైపైకి పోతుండడంతో పేద, మధ్యతరగతి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ అభ్యర్థుల గెలుపు తథ్యమన్నారు. నాయకుడు కరణం కనకారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం జగన్ ప్రజలకు ఎన్ని తాయిలాలు ఇచ్చినా వాటిని తీసుకుని వైసీపీని ఓడిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు కాదా శ్రీను, గడసాల అప్పారావు, ఎల్.మురళీదేవి, శ్రీను, బాబూరావు, ఎస్.కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కోన తాతారావు, తదితరులు

బీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సీఐటీయూ ధర్నా

పెదగంట్యాడ, జనవరి 31: బీసీ రోడ్డు నిర్మాణ పనులను సత్వరమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సీఐటీయూ) బుధవారం ఉదయం పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ జంక్షన్‌లో ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ నిత్యం వేలాది మంది కార్మికులు, ప్రజలు ప్రయాణించే బీసీ రోడ్డు ఏడాది కాలంగా పూర్తిగా ఛిద్రమవ్వడంతో అందరూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పలుమార్లు రోడ్డు ప్రమాదాల బారిన కూడా కార్మికులు గాయాలపాలవుతున్నారని పేర్కొన్నారు.

యూనియన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పెదగంట్యాడ నుంచి గాజువాక వెళ్లాలంటే వాహన చోదకులు బీతిల్లుతున్నారని, అందువల్ల అధికారులు స్పందించి రోడ్డును ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నమ్మి చంద్రరావు, శశిభూషణ్, వి.సోమేశ్, బి.గురప్పు, కె.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆధునీకరణ పనులకు శంకుస్థాపన

గాజువాక కాకతీయ జంక్షన్ నుంచి గంగవరం పోర్టు బ్రిడ్జి వరకు బీసీ రోడ్డు ఆధునీకరణ పనులకు స్థానిక ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో గొలగాని హరి వెంకటకుమారి బుధవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.రెండు కోట్లతో ఈ రోడ్డును ఆధునీకరించనున్నట్టు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గాజువాక తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, తిప్పల వంశీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగసుందరంగా ఎన్ఎస్‌టీఎల్ పార్కు నిర్మాణం

» గోపాలపట్నంలో ఆకర్షణీయంగా నమూనా

ఎన్ఏడీ జంక్షన్ జనవరి 31: గోపాలపట్నం ఎంఆర్‌వో కార్యాలయం ఎదుట మూడురోడ్ల కూడలిలో ఎన్ఎస్‌టీఎల్ నమూనా పార్కు అభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇక్కడ రహదారి నిర్మాణానికి ఎన్ఎస్‌టీఎల్ యాజమాన్యం స్థలాన్ని కేటాయించింది. దీంతో ఇక్కడ మూడురోడ్ల కూడలి మధ్యలో ఉన్న త్రిభుజాకార స్థలంలో ఎన్ఎస్‌టీఎల్ నమూనా పార్కు ఏర్పాటుకు జీవీఎంసీ నుంచి అనుమతి తీసుకున్నారు. ఆ స్థలంలో దాదాపు రూ.70 లక్షలతో ఎన్ఎస్‌టీఎల్ చిహ్నం, మిస్సైల్ సంబంధిత నమూనాల నిర్మిస్తున్నారు. ఇప్పటికే చుట్టూ గ్రిల్స్, మార్బుల్స్, స్టీల్ గేట్లు ఏర్పాటు చేశారు. ఈ పార్కుకు లైటింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. ఆయా పనులు పూర్తయితే ఇక్కడ మూడురోడ్ల కూడలిలో ఒక అందమైన ఆకృతి సంతరించుకొనే అవకాశం ఉంది.



గోపాలపట్నం ఎంఆర్‌వో కార్యాలయం ఎదుట ఎన్ఎస్‌టీఎల్ నమూనా

మహిళల ఆర్థిక సాధికారతతోనే అభివృద్ధి

» వైసీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం, జనవరి 31: మహిళలు ఆర్థిక ఎదిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. గ్రేటర్ విశాఖ 58వ వార్డు కొత్తనక్కావానిపాలెంలో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం డ్వాక్రా సంఘాల మహిళలకు నాలుగో విడత ఆసరా కింద 20,162 మందికి రూ. 39, 36, 34, 291 రూపాయలు అం దించినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్నారన్నారు. జీవీఎంసీ జోన్ 5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పరిశీలకులు రెహ్మాన్, వైఎస్ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదండి బద్రీనాథ్, మాజీ డిప్యూటీమేయర్ దాడి సత్యనారాయణ, కార్పొరేటర్‌లు గులిగిందల లావణ్య, వీవీ సురేష్ , బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

ఇంటక్ నేత మోహన్‌కుమార్‌కు ఘన నివాళి

మల్కాపురం, జనవరి 31: ఇంటక్ జాతీయ ప్రతినిధి డాక్టర్ కేఎస్ మోహన్‌కుమార్ వర్ధంతి పారిశ్రామికప్రాంతంలో జిల్లా ప్రతినిధుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం స్థానిక విజ్ఞాన్ టాలెంట్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు డాక్టర్ మోహన్‌రావు జ్ఞాపకార్థం ఆల్‌ఇన్ వన్ గైడ్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటక్ అధ్యక్షుడు మంత్రిరాజశేఖర్, ప్రధాన కార్యదర్శి నాగభూషణంతోపాటు మోహన్‌కుమార్ కుమారుడు నితిన్, పోర్టు ఇంటక్ ప్రతినిధి ఈశ్వరరావు, షిప్‌యార్డు నాయకుడు శ్రీరామ్మూర్తి, నేవల్ డాక్‌యార్డు ప్రతినిధి పారిపూడి రవి, ఎంఈఎస్ ప్రతినిధి అప్పన్న, స్టీల్‌ప్లాంట్ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, వై.నరసింగరావు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న ప్రతినిధులు

బదిలీ జెడ్సీకి ఘన వీడ్కోలు

వేపగుంట జనవరి 31: వేపగుంట జోన్-8 జెడ్సీగా పనిచేస్తున్న ఎం.మల్లయ్యనాయుడు ఎన్నికల కోడ్ నేపథ్యంలో బదిలీపై విజయనగరం కమిషనర్‌గా వెళుతున్న సందర్భంగా శానిటరీ ఉద్యోగులు బుధవారం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇక్కడి శానిటరీ కార్యాలయంలో ఎమ్‌హెచ్‌ఓ జె.కృష్ణరాజు, సూపర్‌వైజర్ ఎస్.వి.రమణ ఆధ్వర్యంలో ఘనంగా పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. జెడ్సీగా మల్లయ్యనాయుడు పనితీరును కొనియాడారు. ఉద్యో గులు లాజరస్, వెంకటస్వామి, అప్పలనాయుడు, గణేష్, శ్రీను, స్వరూప్ పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడుకు వీడ్కోలు పలుకుతున్న ఉద్యోగులు

ఒరిగిన విద్యుత్ స్తంభం సరిచేయరా?

ఎన్.ఎ.డీ జంక్షన్: గ్రేటర్ 90వ వార్డు విమాన్‌నగర్ 5 వ లైన్‌లో విద్యు త్తు స్తంభం పక్కకు ఒరిగిపోయి ఏక్షణంలో కూలిపోతుందో తెలియని స్థితిలో కాలనీవాసుతు ఆందోళన చెందుతున్నారు. హుద్‌హుద్ సమయంలో ఈ స్తంభం ఒరిగిపోయింది. ప్రధాన రహదారిలోని స్తంభాలు మార్పు చేసి విద్యుత్ అధికారులు అంతర్గత రోడ్డులో ఉన్న ఈ స్తంభం విషయంలో మిన్నకుండి పోయారు.



విమాన్‌నగర్‌లో 5వ లైన్‌లో ఒరిగిన విద్యుత్తు స్తంభం

శ్రీహరిపురంలో ట్రాఫిక్ జామ్

పరస ఉత్సవంతో వాహనదారులకు తిప్పలు

మల్కాపురం, జనవరి 31: శ్రీహరిపురం పరస ఉత్సవం నిర్వహణతో పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం సాయంత్రం ట్రాఫిక్ జామ్ అయింది. అటు శ్రీహరిపురం నుంచి మల్కాపురం వరకు ఇటు శ్రీహరిపురం నుంచి కోరమాండల్ గేటు వరకు వందలాది వాహనాలు నిలిచిపోయాయి. శ్రీహరిపురం పరస మెయిన్‌రోడ్డులో జరగడంతో శ్రీహరిపురం నుంచి మల్కాపురం వైపువెళ్లే మార్గంలో వాహనాలు నెమ్మదిగా వెళ్లాయి దీంతో మరింత ట్రాఫిక్ సమస్య నెలకొంది. పరస ప్రారంభమయ్యే సమయంలో కార్మికులు విధుల నుంచి రావడంతో వాహనాల రద్దీ నెలకొంది. పాదచారులూ ఇబ్బందిపడుతున్నారు. శ్రీహరిపురం వీధుల్లో పలువురు వాహనాలను మళ్లించి గమ్యాని చేరుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టినా సమస్య మాత్రం తీరలేదు. రాత్రికి సమస్య పరిష్కారమైంది. శ్రీహరిపురంలోదుర్గామాంబ, కుంచమాంబ తిరుణాలు (పరస) ఘనంగా జరిగింది. ఈసందర్భం గా వేలాది మందిభక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వైసీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.



మల్కాపురంలో బారులుతీరిన వాహనాలు



జగ్జీవన్‌రామ్‌ను సత్కరిస్తున్న సునీల్‌కుమార్, తదితరులు

సబ్ ప్లాన్ నిధులు దళితవాడల్లో వెచ్చించాలి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 31: భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లవుతున్నా దళితులు విద్య, రాజ్యాధికారానికి చాలా దూరంగా ఉన్నారని రాష్ట్ర డీజీపీ (ఫైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) పీవీ సునీల్‌కుమార్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ అధికారి, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకుడు బూల జగ్జీవన్‌రామ్ అభినందన సభ బుధవారం స్టీల్ క్లబ్ ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితవాడ పంచాయతీల్లోనే దళితుల సమగ్ర అభివృద్ధి జరిగిందన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల్లో 1/3 వంతు దళితవాడల అభివృద్ధికి కేటాయించాలన్నారు. వీటితో మౌలిక సౌకర్యాలను కల్పించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు అధికారులు, కార్మిక సంఘ నాయకులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, జనవరి 31: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస, ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దైవం మరిడిమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం భక్తులంతా ఊరేగింపుగా సారెను ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మి, తదితరులు మరిడిమాంబను దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం తీర్థంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బలిరెడ్డి శ్రీను, బి.అప్పారావు, పి.కొండలరావు, బి.సత్యనారాయణ, వి.వరహాలు, రామచంద్రరరావు, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకున్న అమ్మవారు

ఉక్కు కార్మికులకు వేతన సవరణ చేయాలి

ఇంటక్ ఉక్కు అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 31: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణమే నూతన వేతనాలను అమలు చేయాలని ఇంటక్ ఉక్కు అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌జేసీఎస్‌లో వేతన సవరణపై అంగీకారం జరిగిందని, కానీ స్టీల్‌ప్లాంట్‌లో అమలు కాలేదన్నారు. ప్రతి విషయానికి సెయిల్‌ను అనుసరించే స్టీల్‌ప్లాంట్‌లో మాత్రం వేతన సవరణపై అలా చేయకపోవడం దారుణమన్నారు. కార్మికులకు తక్షణమే నూతన వేతనాలను అమలు చేయకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు పీవీ రమణమూర్తి, నాయక్, ఎస్‌ఏ నాయుడు, సాహూ, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డీవీఆర్‌ఈఎస్‌యూ అధ్యక్షుడు గల్లా శంకర్ సాయిరాం డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ కష్టాల నుంచి లాభాల బాటలో నడవాలంటే సెయిల్‌లో విలీనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై గతంలోనే కేంద్ర మంత్రులకు వినతులు అందజేశామని, మరోసారి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తామని పేర్కొన్నారు. ప్లాంట్ పరిరక్షణకు రాజీ లేని పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

‘టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి’



శిక్షణలో మాట్లాడుతున్న జడ్పీటీసీ మాజీ సభ్యుడు నారాయణరావు

పెందుర్తి, జనవరి 31: టీడీపీ గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని క్రియాశీలక కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, అవినీతి, అక్రమాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలన్నారు. గ్రామస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ప్రతి కార్యకర్తా చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా శ్రమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కరక దేవుడు, నేతలు కునిగంటి కనకరాజు, మడక పార్వతి, యర్రా ప్రశాంతి, ముక్కు రవిసుందర్ పాల్గొన్నారు.

హైస్కూల్‌కు వాటర్ ప్లాంట్ వితరణ



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విద్యార్థిని బిందు

పెందుర్తి, జనవరి 31: స్థానిక ఉన్నత పాఠశాలకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ మినరల్ వాటర్ ప్లాంట్ వితరణగా అందజేసింది. బుధవారం పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయులు కిరణ్మయి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని బిందు చేతులు మీదుగా వాటర్ ప్లాంట్‌ని ప్రారంభించారు. ఈ వాటర్ ప్లాంట్ ద్వారా 350 మంది విద్యార్థులకు శుద్ధ జలం అందుతుందని హెచ్‌ఎం తెలిపారు. ఈసందర్భంగా రెడ్డీస్ ఫౌండేషన్‌కు ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రకాశ్‌కు రజతం



ప్రకాశ్‌కు స్వాగతం పలుకుతున్న క్రీడాకారులు

గోపాలపట్నం, జనవరి 31: ఇటీవల థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో పాల్గొన్న విశాఖ నగరానికి చెందిన మూలపర్తి ప్రకాశ్ అనే యువకుడు రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా థాయ్‌లాండ్ నుంచి గురువారం రాత్రి విశాఖ చేరుకున్న ప్రకాశ్‌కు పలువురు క్రీడాకారులు, కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అంతర్జాతీయ పోటీల్లో పతకం సాధించిన ప్రకాశ్‌కు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

కరాటేలో చిన్నారికి స్వర్ణ పతకాలు



జాతీయస్థాయిలో పతకం సాధించిన నిఖిలశ్రీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 31: జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన పదేళ్ల చిన్నారి ఎం.నిఖిల శ్రీ రెండు స్వర్ణ పతకాలు సాధించింది. గోవాలో జపాన్ కరాటే అసోసియేషన్ నిర్వహించిన ఈ టోర్నీలో నిఖిలశ్రీ అండర్-12 బాలికల కేటగిరిలో ప్రాతినిధ్యం వహించి కుమితే ఈవెంట్‌లో స్వర్ణ పతకం, కటా ఈవెంట్‌లో మరో స్వర్ణం సాధించి నిపుణులను ఆకర్షించింది. జాతీయ పోటీల్లో పతకాలు సాధించడంతోపాటు బ్లాక్ బెల్ట్ డిప్లమో పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో త్వరలో జపాన్‌లో జరగనున్న అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. నగరంలోని జపాన్ మాస్టర్ సెన్‌సాయి ఆర్.మోహన్ వంశీసాయి వద్ద శిక్షణ పొందుతున్న నిఖిలశ్రీ సాధించిన విజయాలపై చీఫ్ ఇన్‌స్ట్రక్టర్లు ఆర్.బాలరాజు, కృష్ణప్రియ అభినందించారు.

పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి సన్మానం



పదవీ విరమణ చేస్తున్న ఏఎస్ఐలతో కమిషనర్

మహారాణిపేట, జనవరి 31: నగర పరిధిలో పదవీ విరమణచేసిన పోలీసు సిబ్బందికి కమిషనర్ ఏ రవిశంకర్ ఆధ్వర్యంలో బుధవారం సన్మాన కార్యక్రమం జరిగింది.కమిషనరేట్‌లో పదవీ విరమణ చేసిన ఆర్ఎస్ఐ ఆర్. వెంకటరావు , ఏఎస్ఐలు బి.వి. నాగభూషణరావు, టి. తారకేశ్వరరావు, కె. వాసు, పి.వి. శ్రీనివాసరావులు, వారి కుటుంబ సభ్యులను సన్మానించారు.

'టీడీపీ- జనసేన గెలుపునకు కృషి'



ప్రచారంలో పాల్గొన్న జనసేన పార్టీ నాయకులు

సీతమ్మధార, జనవరి 31: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు సహకరించాలని జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 24వ వార్డు గాంధీనగర్‌లో ఇంటింటికీ జనంలోకి జనసేన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రస్తుత జగన్‌ప్రభుత్వం అరాచకాలను ప్రజలకు తెలపాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అమరాపు దుర్గా, సంకు వెంకటేశ్వరావు, త్రివేణి, గోపికళ్యాణ్, అడబాల నాని, భాస్కర్, నూకరాజు, నాగమణి, కృష్ణ, దివాకర్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



ముత్యమాంబ గుడి వద్ద నిలిచిపోయిన వాహనాలు



కంచపాలెం మెట్టు వద్ద ట్రాఫిక్ పరిస్థితి

ట్రాఫిక్ జామ్‌తో సహనానికి పరీక్షే..

- కంచరపాలెం రోడ్డులో అవస్థలు
- మెట్టు, ఊర్వశి జంక్షన్‌లలో పరిస్థితి దారుణం
- డివైడర్లు, బారికేడ్లతో సమస్య జటిలం... ప్రయాణికులకు యాతన

కంచరపాలెం, జనవరి 31 : పద్మవ్యూహంలో అభిమన్యుడు చిక్కుపోయిన కథ అందరికీ తెలిసిందే.. దీనికి దీటుగా కంచరపాలెం రోడ్డులో వాహనచోదకులు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఏ వాహనం ఎటువైపు వస్తుందో... ఎక్కడ అడ్డంకులుంటాయో తెలియని పద్మవ్యూహంలో ముందుకు సాగుతుంటారు. నిత్యం ఇక్కడి ట్రాఫిక్ సమస్య సహనానికి పరీక్షగా నిలుస్తోంది. కంచరపాలెం మెట్టు వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ తో అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఇరుకు రోడ్డు...ఆపై ఎక్కడికక్కడ డివైడర్లను అడ్డుపెట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు మరింత అధికమవుతున్నాయి. కంచరపాలెం మెట్టు, ఊర్వశి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేశారు. అయితే, యూ టర్న్ తీసుకోవడానికి కూడా అవకాశం లేనంతగా ఇరుకురోడ్లులో డివైడర్లు, బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి. బీఆర్టీఎస్ రోడ్డులో ఇతర వాహనాలు చొరబడకుండా ఒకవైపు బారికేడ్లు పెట్టి మూసివేశారు. సర్వీస్ రోడ్డులో ఇష్టానుసారం ఆక్రమణలు, ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసి వదిలేయడంతో ట్రాఫిక్ జామ్ నెలకొంటోంది. మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ వరకు సర్వీస్ రోడ్డులో ముందు ఆక్రమణలు, ఇష్టానుసారం వాహనాల పార్కింగ్ నిరోధించగలిగితే వాహనాల రాకపోకలు సజావుగా సాగుతుందని అభి ప్రాయం సర్వ త్రా వ్యక్తమవుతోంది. దిశగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. మెట్టు వద్ద నిత్యం నెలకొంటున్నట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఊర్వశి జంక్షన్ వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కున్న వాహనాలు

జేసీగా విశ్వనాథన్ సేవలు ప్రశంసనీయం

- బదిలీ వీడ్కోలు సభలో కలెక్టర్ మల్లికార్జున



విశ్వనాథన్‌కు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్

మహారాణిపేట, జనవరి 31: చక్కటి పనితీరుతో అందరి మనసులు గెలుచుకున్న జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్ సేవలు ప్రశంసనీయని కలెక్టర్ ఏ మల్లికార్జున్ అన్నారు. జేసీగా పనిచేసిన విశ్వనాథన్ జీవీఎంసీ ఏడీసీపీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఆయనకు దసపల్లా హోటల్‌లో రెవెన్యూ అసోసియేషన్, జిల్లాయంత్రాంగం సంయుక్త ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. అధికారులు ఆయనకు సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విశ్వనాథన్‌తో తమకు అనుబంధాలను పంచుకున్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, డీఆర్వో కె. మోహనకుమార్, ఆర్డీవో హుస్సైన్ సాహెబ్, ఏవో ఈశ్వరరావు ఉన్నారు.

ఆసరా పథకం చెక్కుల పంపిణీ

పూర్ణామార్కెట్, జనవరి 31: టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణంలో ఆసరా పథకం నిధుల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ ఈ చెక్‌లు లబ్ధిదారులకు అందించారు. దక్షిణ నియోజకవర్గంలో పలువురు డ్వాక్రా మహిళలకు ఈసారి చేయూత పథకంలో కోత విధించడంతో సర్వ త్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. కరెంట్ బిల్లులు అధికంగా వచ్చాయని పేర్కొంటూ చాలా మందికి పథకాన్ని దూరం చేయడంపై పలువురు ఈసందర్భంగా ఆగ్రహం వ్యక్తంచేయడంకనిపించింది.

సమష్టిగా ఉత్తమ సేవలందించాలి

సీతమ్మధార, జనవరి 31: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా ప్రజలకు ఉత్తమ సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ప్రభుత్వ నిధులు, దాతలు ఆర్థిక సహాయంతో ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ సిబ్బందితోపాటు ప్రజల సౌకర్యార్థం అదనపు వసతులతో భవనాన్ని సమకూర్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలందించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్య క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, రెవెన్యూ అధికారులు, దాతలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, అధికారులు

సీపీఐ నేత సుబ్బరాజు మృతి తీరని లోటు

అల్లిపురం, జనవరి 31: సీపీఐ సీనియర్ నాయకుడు, జాతీయ బ్యాంకుల యూనియన్ పూర్వ నేత కామ్రెడ్ కెవి. సుబ్బరాజు అకాల మృతి అటు కార్మిక వర్గానికి తీరని లోటని సీపీఐ రాష్ట్రసహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి విచారం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో సుబ్బరాజు భౌతికకాయానికి జరిగిన అంత్యక్రియల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజుతో కలసి పాల్గొని ఆయననివాళులర్పించారు. అనంతరం ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. స్థానిక జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు జె.ఎస్.జె. అచ్యుతరావు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, కె.సత్యంజనేయ, ఎస్.కె. రెహమాన్, పి.చంద్రశేఖర్,క్షేత్రపాల్, వరలక్ష్మి, ఎర్రయ్యరెడ్డి, బి.సి. హెచ్. మసేన్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ అదనపు డీసీపీగా వెంకటరావు

మహారాణిపేట, జనవరి 31: నగర పోలీసు కమిషనరేట్ స్పెషల్‌బ్రాంచ్ అ దనపు డీసీపీగా ఎస్. వెంకటరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఆస్థానంలో పనిచేస్తున్న నాగేంద్రుడుని ఏసీబి అదనపు ఎస్పీగా బదిలీ చేసింది. వెంకటరావు ప్రస్తుతం విజయనగరం సబ్ అడిషనల్ ఎస్పీగా పని చేస్తు న్నారు ఎన్నికల సమయం కావటంతో నగరంలో జరిగే ప్రతీ సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ఆయనను నియమించింది.

ఇద్దరు సూపరింటెండెంట్లపై యాక్షన్

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు సూపరిం టెండెంట్లపై ఆర్డీ చర్యలు తీసుకున్నారు. హెల్త్ అసిస్టెంట్ల నియామకాలు, రెగ్యులరైజేషన్ వ్యవహారంలో డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు రావడంతో వీరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ఆదేశాలతో సదరు అధికారులపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ అక్కడి జిల్లా వైద్య, శాఖ అధికారులు విశాఖలోనిఆర్డీ కార్యాలయానికి ఈ నెల 25న మెయిల్ ద్వారా సమా చారాన్ని అందించారు. అయితే, ఇక్కడి అధికారులు తాత్సారం చేస్తూ వారికి మేలు చేసేలా వ్యవహరించేందుకు యత్నించారు. ఈ విషయాన్ని పలువురు ఆర్డీ దృష్టికి తీసుకువెళ్లగా వారిపై చర్యలు తీసుకున్నారు. సదరు అధికారులను సస్పెండ్ చేస్తూ ఆర్డీ బుధవారం ఆదేశాలు జారీచేశారు.

కేంద్ర ప్రభుత్వ లైఫ్ మిషన్‌కు ఏపీఈఆర్‌సీ మద్దతు

- చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవల ప్రారంభించిన ట్రాన్స్‌ఫర్మేటివ్ లైఫ్ మిషన్‌కు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సంపూర్ణ మద్దతు ప్రకటించినట్టు ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థలు సమర్పించిన ఆదాయ అంచనాల ప్రతిపాదనలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ బుధవారంతో ముగిసింది. విశాఖపట్నం ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 20 మంది తమ అభ్యంతరాలను వ్యక్తంచేశారు. విద్యుత్ వినియోగదారుల గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లు పెట్టాలనే ప్రతిపాదనలు విరమించుకోవాలని, విద్యుత్ చార్జీలు కాకుండా అదనంగా మోపుతున్న ఇతర భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచిస్తామని చెప్పారు. అభిప్రాయ సేకరణలో వచ్చిన అభ్యంతరాలపై విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు పృథ్వీతేజ్, కె.సంతోష్‌రావు, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర వివరణలు ఇచ్చారు. ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు విద్యుత్ రంగంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలను చదివి వినిపించారు. విద్యుత్ చట్టం 2003కు అనుగుణంగా ప్రభుత్వం ఆయా రంగాల వినియోగదారులకు రాయితీపై విద్యుత్‌ను అందించడానికి అవసరమైన నిధులు కేటాయిస్తుందన్నారు.



మిషన్‌లైఫ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాఖపట్నం, జనవరి 31: రైల్వే స్టేషన్ గేట్ నంబరు మూడు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. బుధవారం ఉదయం సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులకు ఘటన స్థలం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుని వయస్సు 60 నుంచి 65 ఏళ్ల ఉంటాయని, జీన్ ప్యాంట్ పింక్ కలర్ షర్టు ధరించి ఛామన చాయ రంగులో ఉన్నారని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారు జీఆర్పీ ఎస్‌హెచ్‌వో ధనుంజయనాయుడు ఫోన్:9440627547, ఎస్ఐ జి.శ్రీనివాసరావు ఫోన్:9866413487 సమాచామివ్వాలి.

వృద్ధురాలికి వలంటీర్లు టోకరా

- బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు తస్కరణ
- కాపు నేస్తం, కులగణన సర్వే పేరుతో వేలి ముద్ర సేకరణ
- పోలీసులకు ఫిర్యాదు మరో ఇద్దరితో కలిసి మోసానికి పాల్పడినట్టు అంగీకరించిన వలంటీర్లు

ఎస్.రాయవరం (అనకాపల్లి జిల్లా), జనవరి 31: గ్రామ వలంటీర్లు కుల గణన సర్వే పేరుతో ఓ వృద్ధురాలి నుంచి వేలిముద్రలు నమోదు చేయించుకుని, ఆమె బ్యాంకు ఖాతా నుంచి పది వేల రూపాయలను కొట్టేసిన సంఘటన అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం జేవీపాలెంలో చోటుచేసుకుంది. వలంటీర్లు జనవరి 21వ తేదీన మోసానికి పాల్పడగా, ఈ విషయాన్ని ఆమె 30వ తేదీన గుర్తించారు. వలంటీర్ల మోసాన్ని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి, బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి బాధితులు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

ఎస్.రాయవరం మండలం జేవీ పాలెం గ్రామానికి చెందిన ఎద్దు లక్ష్మి (60) ఒంటరిగా నివాసం ఉంటున్నారు. గ్రామానికి చెందిన నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్ అనే వలంటీర్లు లక్ష్మి ఈ నెల 21వ తేదీన లక్ష్మి ఇంటికి వెళ్లారు. కాపు నేస్తం, కులగణన సర్వే నిర్వహించడానికి వచ్చామని చెప్పారు. ఆమె నుంచి పలు వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. అనంతరం ఒక డివైజ్‌లో ఆమె వేలి ముద్రలు నమోదు చేసుకుని వెళ్లిపోయారు. ఇదిలావుండగా కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన కింద లక్ష్మికి పక్కా ఇల్లు మంజూరైంది. నిర్మాణంలో వున్న ఈ ఇంటికి సంబంధించి బిల్లు మంజూరు కోసం ఆమె 29వ తేదీన హౌసింగ్ ఏఈని కలిశారు. డబ్బులు జమ అయ్యింది, లేనిదీ బ్యాంకుకు వెళ్లి తెలుసుకోవాలని ఏఈ బదులిచ్చారు. లక్ష్మి 30వ తేదీన ఎలమంచిలిలో వున్న ఏపీ గ్రామీణ వికాస బ్యాంకుకు వెళ్లి వాకబు చేశారు. ఈ మధ్య కాలంలో డబ్బులు ఏమీ జమ కాలేదని, అయితే ఈ నెల 21వ తేదీన ఖాతా నుంచి రూ.10 వేలు తీసినట్టు వుందని బ్యాంకు సిబ్బంది చెప్పారు. దీంతో ఆమె మేనేజర్‌ను కలిసి తన ఖాతా నుంచి ఎవరికి డబ్బులు వెళ్లాయో చెప్పాలని కోరారు. మేనేజర్ తనిఖీ చేసి సైతారుపేట గ్రామానికి చెందిన వీసం రామసోమనాయుడు (బ్యాంకు కరస్పాండెంట్) అనే వ్యక్తి ఖాతాకు జమ అయినట్టు చెప్పారు. ఆ రోజు (21వ తేదీ) తన వద్ద వేలి ముద్రలు తీసుకున్న వలంటీర్లపై అనుమానం వచ్చి ఆమె ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ నాయకుడు వజ్రపు శంకరరావుకు చెప్పారు. ఆయన బుధవారం లక్ష్మిని వెంటబెట్టుకుని పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి కూడా తీసుకువెళ్లారు. అనంతరం వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్‌తోపాటు సైతారుపేటకు చెందిన వీసం రామసోమనాయుడు పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు విచారించగా..బ్యాంకు కరస్పాండెంట్ రామసోమనాయుడు వద్ద వుండే డివైజ్‌లో లక్ష్మి వేలి ముద్రను నమోదు చేసుకుని, ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలను బదలాయించినట్టు వలంటీర్లు చెప్పారు. వీరికి వేమగిరి గ్రామానికి చెందిన వై.రవి సహకరించినట్టు తెలియడంతో అతడిని కూడా రప్పించి విచారించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు వజ్రపు శంకరరావు మాట్లాడుతూ, వృద్ధురాలిని మోసగించి డబ్బులు తస్కరించిన వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్, వీరికి సహకరించిన వీసం రామసోమనాయుడు, వై.రవిలపై కేసు నమోదు చేయాలని, వలంటీర్లను విధుల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఎస్ఐ విభీషణరావును వివరణ కోరగా..కుల గణన సర్వే కోసం వచ్చిన వలంటీర్లు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు అపహరించినట్టు ఎద్దు లక్ష్మి ఫిర్యాదు చేశారని, ఇంకా కేసు నమోదు చేయలేదని బదులిచ్చారు.

బీజేపీలో తికమక

- నేడు పార్లమెంటు కార్యాలయం ప్రారంభం
- ఇప్పటికే జీవీఎల్ ఆధ్వర్యంలో ఒక కార్యాలయం

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలోని 25 జిల్లాల్లో గురువారం పార్లమెంటు కార్యాలయాల ప్రారంభానికి సిద్ధమైంది. అందులో భాగంగా విశాఖపట్నం పార్లమెంటు కార్యాలయాన్ని లాసన్స్‌బే కాలనీలో గల పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి తపన చౌదరి, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు హాజరవుతున్నారు. ఇదిలావుండగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచి లోక్‌సభకు పోటీ చేయాలనే ఉద్దేశంతో ఇప్పటికే లాసన్స్‌బే కాలనీలో ఓ కార్యాలయాన్ని నడుపుతున్నారు. మొదట్లో బీజేపీ కార్యాలయంలోనే కార్యక్రమాలు నిర్వహించి, ఆ తరువాత దానికి ఎదురుగానే ఓ భవనంలో సొంత కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. ఆయన ఏ కార్యక్రమం చేపట్టినా 'బీజేపీ' పేరుతో కాకుండా "జీవీఎల్" బ్రాండ్ పేరుతో నిర్వహిస్తున్నారు. 'జీవీఎల్ కార్యాలయం', 'జీవీఎల్ సంక్రాంతి వేడుకలు', 'జీవీఎల్ రిపబ్లిక్ రన్'...ఇలా చేసుకుంటూ పోతున్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో బీజేపీ తరపున రెండు పార్లమెంటు కార్యాలయాలు నడిచే సూచనలు కనిపిస్తున్నాయి. ఢిల్లీ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చేంత వరకు ఈ వ్యవహారాలు కొనసాగుతాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు: సీపీ



కమిషనరేట్‌లో జరిగిన సమీక్షలో అధికారులు

మహారాణిపేట, జనవరి 31: నగరంలో క్రైమ్ రేటు తగ్గేలా రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరంగా చేపట్టాలని నగర పోలీసు కమిషనర్ ఏ రవి శంకర్ ఆదేశించారు. పోలీసు శాఖ పని తీరుపై బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు ఉన్నత అధికారులు, లీగల్ అడ్వయిజర్లతో పాటు ఏడీసీపీలు, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, క్రైమ్, స్పెషల్ బ్రాంచిలపై వేర్వేరుగా కమిషనర్ సమీక్ష చే శారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చెక్‌పోస్టులపై నిఘా పటిష్టంచేయాలని ఆయన కోరారు. అన్నివాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్య క్రమాలు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అన్ని పోలీసు స్టేష న్లలో నమోదైన కేసుల తీరు, వివరాలు తదితర అంశాలను పరిశీలించారు. మహిళల వేధింపులు, మిస్సింగ్ కేసులపై ఎటువంటి జాప్యం లేకుండా స్పందించాలన్నారు.

పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, జనవరి 31: స్టీల్‌ప్లాంట్, కార్మికుల కోసం అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,084వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 నెలలుగా కార్మికులు, ప్రజలు, బీజేపీ మినహా మిగతా రాజకీయ పక్షాల మద్దతుతో పోరాటాలు చేస్తున్నా కేంద్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుందన్నారు. గాంధేయవాదాన్ని బలపరుస్తున్న కేంద్ర ప్రభుత్వం గాంధేయ మార్గంలో జరుగుతున్న పోరాటాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎలాంటా త్యాగాలకైనా సిద్ధమని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్రం తమ నిరంకుశత్వాన్ని విడనాడకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

9వ తేదీ వరకు 'డ్వాక్రా బజారు'



ఎగ్జిబిషన్‌లో కొనుగోలుదారులు

మహారాణిపేట, జనవరి 31: డ్వాక్రా మహిళలు, చేనేత కార్మికులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించాలనే ఆలోచనతోనే డ్వాక్రా బజారు పేరిట ఈనెల 9వ తేదీ వరకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్టు నిర్వాహకుడు మహేశ్ తెలిపారు. బుధవారం బీచ్ రోడ్డులోని విశ్వ ప్రియా ఫంక్షన్ హాల్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ పొందూరు, బెంగాల్, పోచంపల్లి, గద్వాల్, కాశ్మీర్, జైపూర్ తదితర ప్రాంతాల మహిళలు, చేతివృత్తిదారులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయన్నారు.

ప్రైవేటుకు ఉక్కు ఆస్పత్రి!?...

5వ పేజీ తరువాయి

ఆస్పత్రులు యత్నిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలో పైరవీలు జరుగుతున్నాయి. ఏమైందో తెలియదు గానీ ఇక్కడి స్టీల్ ప్లాంటు డైరెక్టర్ ఒకాయన రెండు రోజుల క్రితం హుటాహుటిన రెండు రోజుల క్రితం ఢిల్లీ వెళ్లారు. అక్కడి నుంచి ఆస్పత్రికి సంబంధించిన వివరాలు తీసుకున్నారు. ప్రైవేటుకు అప్పగిస్తే ఎలా ఉంటుందనే దానిపై చర్చలు జరుగుతున్నాయనే విషయం స్టీల్‌ప్లాంటు ఉద్యోగ వర్గాలకు, కార్మిక వర్గాలకు తెలియడంతో వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించం

డి.ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి, ఉక్కు గుర్తింపు సంఘం

స్టీల్ తయారీ రంగం నిరంతరం పనిచేయాల్సిన పరిశ్రమ. విశాఖపట్నం పోర్టు ఆస్పత్రిలా ఇక్కడ చేయడానికి వీలు కాదు. 24/7 ఆస్పత్రి పనిచేయాల్సిందే. ప్రైవేటుకో, అవుట్ సోర్సింగ్‌కో ఇస్తామంటే ఒప్పుకోం. ఇక్కడికి ఎవరు వచ్చినా భూముల కోసమేనని అందరికీ తెలిసిందే. ప్రైవేటు ఆస్పత్రులు వస్తే బిల్లులు పెరిగిపోతాయి. అది మళ్లీ ప్లాంటుకే భారం.

తహసీల్దార్ల బదిలీ

... 5వ పేజీ తరువాయి

సీహెచ్‌వీ రమేష్, ఎస్.రమణయ్య, పి.శ్యామ్‌ప్రసాద్, పి.రమాదేవిను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. జిల్లాకు వచ్చి మూడేళ్ల పూర్తికాని మహారాణిపేట, గాజువాక తహసీల్దార్లు ఆనందకుమార్, శ్రీవల్లీలకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. తాజా బదిలీల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి శ్రీకాకుళం తహసీల్దారు ఎన్.వెంకటరావు, నెల్లూరులో ఏపీ మారిటైమ్ బోర్డులో పనిచేస్తున్న వై.జయలక్ష్మి, విజయనగరం జిల్లా మెంటాడ, జామి, కొత్తవలస, భోగాపురం, పూసపాటిరేగ, గరివిడి, మెరకముడిదాం, బలిజిపేట, సీతానగరం తహసీల్దార్లు టి.రామకృష్ణ, జి.హేమంత్‌కుమార్, శ్రీనివాస మిశ్రా, సీహెచ్ బంగార్రాజు, జి.భాస్కరరావు, టి.గోవింద్, పి.విజయభాస్కర్, పి.అప్పలరాజు, ఎన్వీ రమణలను విశాఖ జిల్లాకు కేటాయించారు. విజయనగరం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న బీఎస్ దేవీప్రసాద్, బి.నీలకంఠరావు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఆర్.ఉమామహేశ్వరరావు, జి.శ్రీరామమూర్తి, డి.రవి, ఎం. రమణమ్మ, ఎన్.భాస్కరరావు, పార్వతీపురం ఆర్డీవో కార్యాలయ పాలనాధికారి వి.రామస్వామి, పార్వతీపురం, సాలూరు, కొమరాడ తహసీల్దార్లు ఎన్.శ్రీమన్నారాయణ, ఆర్.బాలమురళీకృష్ణ, ఎం.భుజంగరావులను విశాఖ జిల్లాకు బదిలీ చేశారు. వీరందరికీ విశాఖ జిల్లా కలెక్టర్ పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఇందుకు రెండు, మూడు రోజుల గడువు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



కల్యాణం చేస్తున్న అర్చకులు

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జనవరి 31 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో రజితవేదికపై అధిష్టింపజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఐవీ రమణాచార్యులు ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక నిఘా : సీఐ

ఆరిలోవ, జనవరి 31 : ఆరిలోవ పోలీసుస్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని సీఐ గోవిందరావు తెలిపారు. శుక్రవారం ఆయన నూతన సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, ఎటువంటి రాజకీయ ఒత్తిడికి గురవ్వకుండా విధులు నిర్వర్తిస్తామని చెప్పారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

భీమునిపట్నం, జనవరి 31 : పట్టణంలోని 4వ వార్డు మంగమారిపేట నరసింహనగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవనానికి వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ నిధులతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఐదు విలీన గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గరికిన పరదేశి, చీపుళ్ల మహేష్, గరికిన ఢిల్లీబాబు,గరికిన దాసుకొండ, గరికిన నూకరాజు, గరికిన నాగరాజు, మేరుగు చిన్నారావు పాల్గొన్నారు.

'వైసీపీ కార్యాలయాలుగా వర్సిటీలు'

ఎంవీపీ కాలనీ, జనవరి 31 : విశ్వవిద్యాలయాలను వైసీపీ ప్రభుత్వం తమ కార్యాలయాలుగా మార్చేశారని టీఎస్ఎన్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కాకినాడలోని జేఎన్‌టీయూకేలో జగనన్న కాలేజ్ కెప్టెన్సీ పేరిట సభ నిర్వహించడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు ఉన్నత విద్య అందించాల్సిన వర్సిటీలను ముఖ్యమంత్రి జగన్ తన భజనాలయాలుగా మార్చేశారని పేర్కొన్నారు. మొన్న స్టేట్ సిలబస్, నిన్న సీబీఎస్ఈ, నేడు ఐబీ పేరుతో విద్యా రంగంలో రోజుకో కొత్త ప్రయోగాలు చేస్తున్నారని చెప్పారు. సీబీఎస్ సిలబస్ కోసం విద్యార్థుల నుంచి రూ. 300 చొప్పున వసూలు చేసిన నగదు ఏమైందని ప్రశ్నించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, జనవరి 31 : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ శివశక్తినగర్ ఫీడర్ నిర్వహణ దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శివశక్తినగర్ రోడ్, అయ్యప్పనగర్, వైఎస్సార్ నగర్, గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రి, కార్పెంటర్స్ కాలనీ, దివ్యాంగుల కాలనీ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

మొక్కలు నాటిన వీసీ

వెంకోజీపాలెం, జనవరి 31 : ఏయూ తెలుగు విభాగం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి బుధవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విభాగాచార్యులు జర్రా అప్పారావు, పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19,టమాటా 26, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 50, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 16, క్యారెట్ 20, దొండకాయలు 26, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 115, బరబటి 28, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 48 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 56, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



చిల్డ్రన్ ప్లే పార్కులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ



రోడ్డు పనులు పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

వెంకోజీపాలెం, జనవరి 31 : జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీకాలనీ కొండవాలు ప్రాంతంలో నూతనంగా నిర్మించినపార్కును కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్డ్రన్ ప్లే ఏరీనాను పచ్చదనంతో నింపడంతో పాటు పిల్లలు ఆటలు ఆడుకునే విధంగా తీర్చిదిద్దాలని ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. పిల్లల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన ఈ పార్కులో ప్రతిరోజూ పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని, పార్కులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను నిత్యం పరిశీలించాలని చెప్పారు. పార్కు నిర్వహణను నివాసిత సంక్షేమ సంఘానికి అప్పగించాలని జోనల్ కమిషనర్‌కు సూచించారు.అనంతరం ఆయన పోలమాంబ గుడి ఎదురుగా ఉన్న ఈఎన్‌టీ ఆస్పత్రి నుంచి బీచ్ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు, ఫుట్‌పాత్, విద్యుత్ స్తంభాల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డుకి ఇరువైపులా గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసి, రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న చెట్లను గుర్తించి వాటిని మరోచోటుకి ట్రాన్స్‌ప్లాంటేషన్ జరపాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు పర్యవేక్షక ఇంజనీర్లు సత్యనారాయణరాజు, వినయ్‌కుమార్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రఘునాథ్, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు మోసం : ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, జనవరి 31 : చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు అని, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా.. ఆయన ముఖ్యమంత్రి కావాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. బుధవారం సాయంత్రం 11వ వార్డులో అధ్యక్షుడు ముగడ రాజారావు ఆధ్వర్యంలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తామన్నారు. జగన్ మరోసారి సీఎం అయితే పేదల బతుకులు మరింత దుర్భరంగా మారుతాయని తెలిపారు. వైసీపీ పాలనలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలు దౌర్జన్యాలు, భూకబ్జాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఒమ్మి అప్పలరాజు, ఆబోతుల అప్పలనాయుడు, గాడి సత్యం, జనసేన నాయకులు సరిపల్లి రాము, ఎం. కృష్ణంరాజు, మూది అప్పారావు, బయ శ్రీను, లింగం సత్యన్నారాయణ, ఆదినారాయణరాజు, చందక లలిత, సత్యవతి. రేఖా జ్యోతి పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను చూపిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి



పాదయాత్రలో పాల్గొన్న వంశీకృష్ణ శ్రీనివాస్, సందీప్

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు : వంశీకృష్ణ

తగరపువలస, జనవరి 31 : రాష్ట్రంలోనూ, ఉత్తరాంధ్రలోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని జనసేన నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లో జనసేనికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో 70 రోజుల్లో జరిగే ఎన్నికల్లో ప్రజలు మంచి తీర్పు ఇవ్వనున్నారని చెప్పారు. జనసేన టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బీపీ కృష్ణయ్య, శంకర్‌రెడ్డి, శ్రీనుబాబు, నాగోతి నర్సింహనాయుడు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ శాల భవన నిర్మాణానికి భూమి పూజ



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు

పద్మనాభం, జనవరి 31 : మండలంలోని ఆర్‌వీ పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధాన మంత్రి శ్రీ పథకం నిధులతో నిర్మించనున్న రసాయన శాస్త్ర ప్రయోగశాల భవన నిర్మాణానికి జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్. గిరిబాబు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 15.80 లక్షల పీఎంశ్రీ నిధులతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్టు చెప్పారు.అనంతరం ఆయన పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు కె. లక్ష్మణరావు, పాఠశాల హెచ్ఎం శంకరరావు, ఎంపీటీసీ సభ్యుడు సూరప్పడు, విద్యా కమిటీ ఛైర్మన్ రామస్వామి, కోఆప్షన్ సభ్యుడు అప్పారావు, వైసీపీ నాయకులు రమణ, శ్రీను పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం



పదవి విరమణ పొందిన ఉద్యోగులతో ఏడీసీ శ్రీనివాసరావు, తదితరులు

వెంకోజీపాలెం, జనవరి 31 : ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రజలకు ప్రభుత్వానికి ఎన్నో సేవలు అందించా రని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవీఎంసీలో పదవీ విరమణ పొందిన పది మంది ఉద్యోగులు చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఏఓ పద్మజ, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు కుమార్, మూర్తి, శానిటరీ సూపర్‌వైజర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణకు ఏయూ పీహెచ్‌డీ

వెంకోజీపాలెం, జనవరి 31 : ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆవశ్యకతపై చేసిన పరిశోధనకు గాను బొండా రామకృష్ణకు ఏయూ డాక్టరేట్ ప్రకటించింది. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఔచిత్యంపై ఆయన పరిశోధన చేశారు. జర్నలిజం ఆచార్యులు చల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ పరిశోధన జరిగింది. ప్రెస్ కౌన్సిల్ అధికారాలు విస్తృత పరచాలని రామకృష్ణ తన పరిశోధనల ద్వారా ప్రభుత్వానికి సూచించారు. ఈ సందర్భంగా జర్నలిజం విభాగం ఆచార్యులు వినయ్‌కుమార్ ఆయన్ను అభినందించారు.

ఇద్దరు క్రీడాకారులకు ఇళ్ల స్థలాలు

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నిర్వహించిన మంత్రి వర్గ సమావేశంలో ఇళ్ల స్థలాలు కేటాయించింది. చదరంగం ప్లేయర్ కోలగట్ల అలనా మీనాక్షికి 500 గజాలు, అంతర్జాతీయ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేనికి వెయ్యి గజాల స్థలాన్ని పెందుర్తి మండలం చినముషిడివాడలో కేటాయించారు. గతంలో జానపద కళాకారుడు వంగపండు ప్రసాదరావు భార్యకు కూడా ఇక్కడే ఇంటి స్థలం కేటాయించారు.

ఉక్కు కార్మికులకు వేతన సవరణ చేయాలి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 31 : స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణమే నూతన వేతనాలను అమలు చేయాలని ఇంటక్ ఉక్కు అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌జేసీఎస్‌లో వేతన సవరణపై అంగీకారం జరిగిందని, కానీ స్టీల్‌ప్లాంట్‌లో అమలు కాలేదన్నారు. ప్రతి విషయానికి సెయిల్‌ను అనుసరించే స్టీల్‌ప్లాంట్‌లో మాత్రం వేతన సవరణపై అలా చేయకపోవడం దారుణమన్నారు. కార్మికులకు తక్షణమే నూతన వేతనాలను అమలు చేయకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు పీవీ రమణమూర్తి, నాయక్, ఎస్‌ఏ నాయుడు, సాహూ, పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పండిట్ రవిశంకర్

ఒత్తిడే ఆత్మహత్యలకు కారణం

» ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్

సాగర్‌నగర్, జనవరి 31 : విద్యా వ్యవస్థలో అధ్యాపకులు, ఆచార్యులు తీవ్ర ఒత్తిడి మధ్య పని చేస్తున్నారని, ఆ ప్రభావం యువతపై పడుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు, గురుదేవ్ రవిశంకర్ అన్నారు. గీతం యూనివర్సిటీ ఆవరణలో ఎడ్యుయూత్ మీట్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం విద్యా వేత్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడి నుంచి బయటపడే మార్గం తెలియక కొందరు యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, మరికొందరు మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని తెలిపారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో యువత నేరస్తులుగా మారడంతో తుపాకీ సంస్కృతి బాగా పెరిగిందన్నారు. విద్యార్థులు ఒత్తిడి నుంచి దూరం కావాలంటే ప్రతిరోజూ శ్వాసప్రక్రియ నిర్వహించాలని సూచించారు. గీతం విద్యా సంస్థల అధ్యక్షుడు ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలో రెండు వేల మంది విద్యార్థులు సభ్యులుగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గీతం వీసీ దయానంద సిద్దవటం, జిమ్‌సర్ వీసీ గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే అధికారులకు గుర్తింపు



ఎంపీడీవో లవరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం, జనవరి 31 : ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులకు సమాజంలో ఎళ్లవేళలా గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో లవరాజును సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ అంకితభావంతో పని చేయాలన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఎంపీడీవో లవరాజు ప్రజాప్రతినిధులను, అధికారులను సమన్వయపరుస్తూ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. అనంతరం లవరాజును సన్మానించి, మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారాదా ప్రియాంక, జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, నాయకులు బంక సత్యన్నారాయణ, బి. మణిశంకర్ నాయుడు, కంటుభుక్త రాంబాబు, సుంకరి గిరిబాబు, పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘనంగా సన్మానం



నరసింగరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొమ్మాది, జనవరి 31 : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు టీచర్‌గా పని చేస్తూ పదవీ విరమణ చేసిన చౌదరి నరసింగరావును పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజాబాబు, సమగ్రశిక్షాభియాన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, విద్యా కమిటీ సభ్యులు పిళ్లా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం

ఆనందపురం, జనవరి 31 : అర్హత ఉన్నవారికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తుంటే కొంతమంది నాయకులు పనికట్టుకుని వ్యతిరేకించడం సరికాదని సర్పంచ్ చందక లక్ష్మి అన్నారు.బుధవారం ఆమె ఆనందపురం పంచాయతీలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా ఎమ్మెల్యే సహకారంతో మొదటి విడతలో 330 మందికి ఇళ్ల పట్టాలు అందజేశామన్నారు. కొంతమంది లబ్ధిదారులు మిగిలిపోవడంతో సర్వే నెంబరు 276లో 270 మందికి పట్టాలు అందించడానికి అధికారుల ఆధ్వర్యంలో స్థలం చదును చేస్తున్నామని చెప్పారు. కానీ కొంతమంది నాయకులు అధికారులపై తప్పుడు ఆరోపణలతో బురద జల్లే ప్రయత్నం చేయడం తగదన్నారు. పేదలకు న్యాయం చేయాలన్న తలంపుతో పార్టీలకతీతంగా అర్హత మేరకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తున్నామని, ఇందులో ఎటువంటి అవినీతి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొట్యాడ రెడ్డిబాబు, ఉప సర్పంచ్ బంటుబిల్లి రమణమ్మ, నాయకులు సీహెచ్ అప్పలస్వామి, షిణగం రామారావు, పాల్గొన్నారు.



రోడ్డుపై ఏర్పాటు చేసిన స్టాపర్లు

రోడ్డు మూసివేతతో రాకపోకలకు అవస్థలు

ఆరిలోవ, జనవరి 31 : తోటగరువులో బ్రిడ్జి నిర్మాణ పనుల దృష్ట్యా జీవీఎంసీ అధికారులు రోడ్డు మూసివేయడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సుమారు రూ. 3 కోట్లతో జీవీఎంసీ బ్రిడ్జి నిర్మాణం చేపడుతోంది. అయితే స్థానికుల రాకపోకలకు వీలుగా ఎటువంటి తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేయకపోవడంతో అటువైపుగా రాకపోకలు సాగిస్తున్న వారు చుట్టూ మూడు కిలోమీటర్లు తిరగాల్సి వస్తోంది. ఈమార్గంలో తోటగరువు ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు ఉద్యోగులు, స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డును మూసివేయడంతో వారంతా నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఓట్లు దుర్వినియోగం కారాదు : కోరాడ



శిక్షణలో మాట్లాడుతున్న రాజబాబు

భీమునిపట్నం, జనవరి 31 : వచ్చే ఎన్నికలను టీడీపీ కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఓట్లు దుర్వినియోగం కాకుండా చూడాలని పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు, 1,2,3,4,5,6,7,8 వార్డుల క్లస్టర్, యూనిట్, బూత్‌లెవల్ ఇన్‌చార్జిలకు ఇంటిగ్రేటెడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్‌వోలతో కలిసి ఓటరు వెరిఫికేషన్‌లో పాల్గొని, ఓటరు హౌస్ మ్యాపింగ్ చేసుకుని ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా చూడాలన్నారు. హౌస్ మ్యాపింగ్ ద్వారా దొంగ ఓట్లను అరికట్టవచ్చునని చెప్పారు. తొలుత కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన శిక్షకులు కార్యకర్తలకు హౌస్ మ్యాపింగ్‌తో పాటు టెలిగ్రామ్ బాట్, ఐటీడీపీ, ఆర్‌టీఎస్ ప్రోగ్రామ్‌లపై శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, భీమిలి మండల పార్టీ అధ్యక్షుడు దంతులూరి అప్పల నరసింహరాజు, నాయకులు పాసి నరసింగరావు, కసిరెడ్డి దామోదరరావు, కురిమిన లీలావతి, అంగటి రాము, పిట్టా సురేష్, కోరాడ రమణ, మీసాల సత్యనారాయణ, తమ్మిన సూరిబాబు, బడిగంటి నీలకంఠం, ఐటీడీపీ మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, పతివాడ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన



డ్రైవర్లకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు

సింహాచలం, జనవరి 3 : ఆర్‌టీసీ డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు చెప్పారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు పురస్కరించుని పీటీడీ సింహాచలం కాంప్లెక్స్‌లో బుధవారం మధ్యాహ్న భోజన విరామంలో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎల్లవేళలా అప్రమత్తతతో ఉండాలన్నారు. ప్రధానంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో బస్సులు నడిపేటపుడు నిర్ణీత బస్ బేలో మాత్రమే నిలపాలని, నిర్ణీత వేగంతో నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాలతీ చందూర్ జీవిత చరిత్రపై సదస్సు

వెంకోజీపాలెం, జనవరి 31 : ప్రముఖ రచయిత్రి, కాలమిస్టు డాక్టర్ మాలతీ చందూర్ జీవిత చరిత్రపై ఏయూ తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ముందుగా అతిథులు మాలతీ చందూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో వీసీ ప్రసాదరెడ్డి, విశిష్ట అతిథి ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ చందూర్ రచనలు యువతకు ఆదర్శనీయమని చెప్పారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కృషి చేయాలని తెలిపారు.

బాక్సింగ్ క్రీడాకారిణికి అభినందనలు

వెంకోజీపాలెం, జనవరి 31 : ఏయూ అనుబంధ కళాశాల విద్యార్థిని కె. శ్రీవర్షితను వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల జరిగిన ఖేలో ఇండియా పోటీల్లో బాక్సింగ్ విభాగంలో (45 - 48 కిలోలు) శ్రీవర్షిత కాంస్య పతకం సాధించింది. శ్రీచాణక్య డిగ్రీ కళాశాలలో బీబీఏ చదువుతున్న ఆమె క్రీడాకారిణిగా జాతీయ స్థాయిలో రాణించడం పట్ల వీసీ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యతో ఆత్మరక్షణ

భీమునిపట్నం, జనవరి 31 : ప్రస్తుత సమాజంలో ఆత్మరక్షణ కోసం బాల, బాలికలు కరాటే నేర్చుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు సూచించారు. బుధవారం పట్టణంలో అసోసియేషన్ ఆఫ్ షాడో వారియర్స్, షోటో కాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా అసోసియేషన్ చీఫ్ కోచ్ ముగడ వెంకటరమణ యాదవ్ ఎంతోమంది యువతకు కరాటే, షాడో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చి ప్రయోజకులను చేస్తున్నారని కొనియాడారు. శిక్షణ ద్వారా పిల్లలు మానసిక ఒత్తిడికి దూరమై, ఏకాగ్రత పొందుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ముమ్మిడిశెట్టి ఆదిత్య, కొక్కిరి అప్పన్న, కరాటే కోచ్‌లు ఉమ్మిడి నర్సింగరావు, నరవకోట శ్రీను పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యులకు ఆసరా చెక్కులు పంపిణీ

తగరపువలస, జనవరి 31 : తగరపువలస పరిధిలోని డ్వాక్రా మహిళలకు రూ.9.96,23,116 కోట్ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. చిట్టివలస బంతాట మైదానంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ రాము, వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

ఆచార్య భరతలక్ష్మికి జాతీయ పురస్కారం

వెంకోజీపాలెం,జనవరి 31 : ఏయూ జువాలజీ విభాగం ఎమిరిటస్ ప్రొఫెసర్ ఆచార్య బి. భరతలక్ష్మి జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. జువాలజీ రంగంలో ఆమె చేసిన కృషిని గుర్తిస్తూ బిష్యమోయ్ బిస్వాస్ జూలాజికల్ సొసైటీ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆమెను ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. ఆచా ర్యులు సాధించే పురస్కారాల వల్ల వర్సిటీకి పేరు ప్రతిష్టలు వస్తాయని వీసీ పేర్కొన్నారు.